

నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

నెల్లూరు (విద్య) : తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మంగళవారం కూడా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులను ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు విధిగా అమలు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యాసంస్థలను తెరవకూడదని డీఈఓ బాలాజీరావు తెలిపారు. ఎంఈఓలు హెడ్ క్వార్టర్స్‌లో ఉండి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని, ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా జూనియర్ కళాశాలలు కూడా ఆదేశాలను విధిగా పాటించాలని ఆర్ఐఓ వరప్రసాద్‌రావు తెలిపారు.



ఇందుకూరుపేట మండలం మైపాడులో కసురుమీదున్న కడలి



మొంథా.. ముసురు

- జిల్లాపై ప్రభావం చూపని తుఫాన్
- రోజంతా జడివాన, చలిగాలులు
- సరాసరి 4.6 మి.మీ వర్షపాతం నమోదు
- ఊపిరిపీల్చుకున్న అధికారులు, ప్రజలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నిండు కుండల్లా నీటివనరులు
- పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి, కలెక్టర్

కంట్రోల్ రూము ఫోన్ నెంబర్లు : 0861-2331261, 7995576699

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'మొంథా' తుఫాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తేలిక పాటి వర్షం పడినా సాయంత్రానికి ఈదురు గాలులలో కూడిన వర్షం పడింది. జిల్లా యంత్రాంగం తుఫాన్‌ను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్ కేంద్రాలలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసింది. తీర ప్రాంతాలలో అధికారులు తుఫాన్ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలో సగటు వర్షపాతం 4.6 మి.మీగా నమోదైంది. అత్యధికంగా పొదలకూరులో 18.8 మి.మీ వర్షం కురిసింది. మంగళ, బుధవారాలలోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

● చెరువుల్లో జలకళ

గడిచిన పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని చాలా వరకూ చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. ఇప్పుడు కురు స్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో వాగులు పొంగిపొర్లుతున్నాయి. బొగ్గేరు పొంగడంతో సంగం మండలం వీర్లగుడిపాడుకు రాకపోకలు నిలిచిపోయాయి. వరికుంటపాడు మండలం కనియంపాడు సమీపంలో వాగు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలకు ఆగిపోయాయి. ఇక ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సోమశిల జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది.

ఏ పరిస్థితినైనా ఎదుర్కొందాం!

ముందస్తు నివారణ చర్యలతోనే తుఫాన్ నష్టాన్ని నివారించగలమని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో తుఫాన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో ఆయన సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మెడికల్ హెల్త్, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ తుఫాన్ నుంచి ప్రజలను రక్షించేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. జిల్లాలో 9 తీర మండలాలు, వీటిలో 42 సున్నిత గ్రామాలను, 166 నివాసాలను గుర్తించామని తెలిపారు. 144 సహాయ కేంద్రాలను ప్రజల కోసం ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. ప్రతి మండలానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించినట్లు తెలిపారు. పెన్నానది పరివాహక ప్రాంతాల్లో వరదల ప్రభావం చూపే 40 సున్నిత ప్రదేశాలను గుర్తించి తాత్కాలిక మరమ్మతు పనులు చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు డీఆర్వో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యువరాజ్

ముత్తుకూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను తీవ్రత పెరిగిన నేపథ్యంలో సోమవారం కృష్ణపట్నం పోర్టులో 5వ నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేశారు. తుఫాను తీవ్రత అధికంగా ఉండవచ్చన్న సూచనలతో అధికారులు అప్రమత్తమయ్యారు.

పోర్టులో ఐదో నెంబరు ప్రమాద హెచ్చరిక

● ఫోన్ చేసిన వెంటనే స్పందించండి

కంట్రోల్ రూముకు ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలని జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ కంట్రోల్ రూము సిబ్బందిని ఆదేశించారు. సోమవారం తిక్కన భవన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమును కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌తో పాటు కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మొంథా తుఫాన్ ముప్పు నుంచి జిల్లా బయటపడినట్లే కనిపిస్తోంది. తీవ్ర తుఫాన్‌గా మారి జిల్లాపై ప్రభావం చూపుతుందని అంచనా వేసినప్పటికీ అది దిశను మార్చుకొని కాకినాడ తీరం వైపు కదలడంతో జిల్లా ఊపిరిపీల్చుకుంది. ముందస్తు హెచ్చరికల ప్రకారం సోమవారం జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవాలి. మంగళవారం తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. కానీ సోమవారం తేలికపాటి చినుకులు మాత్రమే పడ్డాయి. కొన్ని మండలాల్లో అసలు ఆ చినుకులు కూడా పడలేదు.

తుఫాన్ ఉంది.. పారాహుషార్!

● మైకుల్లో విస్తృత ప్రచారం



మొంథా తుఫాన్ పట్ల జాగ్రత్తగా ఉండాలని పాలకులు, అధికారులు ప్రకటనలు చేస్తుంటే ఓ ఆరోగ్య కార్యకర్త మాత్రం వినూత్న ప్రచారం చేస్తూ ప్రజలను అప్రమత్తత చేస్తున్నారు. మండలంలోని అప్పసముద్రం పంచాయతీ ఆరోగ్య కార్యకర్త ఎండీ మన్సూర్‌అలీ సిబ్బందితో కలిసి మైక్రో మైకు ద్వారా పంచాయతీలోని అన్ని గ్రామాల్లో తిరుగుతూ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, బయటకు రావద్దని అరుస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)

మండలం	వర్షపాతం (మి.మీ)
పొదలకూరు	18.8
ముత్తుకూరు	14.6
టీపీ గూడూరు	13.6
ఇందుకూరుపేట	11.2
మనుబోలు	10.2
వెంకటాచలం	10.2
నెల్లూరు రూరల్	9.6
నెల్లూరు అర్బన్	8.4
దగదర్తి	7.2
కోవూరు	6.4
విడవలూరు	6.2
అల్లూరు	5.8
బోగోలు	5.6
సైదాపురం	5.6
కొడవలూరు	5.2
సంగం	5.2
జలదంకి	5.2
బుచ్చి	5.0
రాపూరు	3.2
చేజర్ల	2.2
ఉదయగిరి	2.2
కలువాయి	2.0
వలేటివారిపాలెం	2.0
ఆత్మకూరు	1.8
కలిగిరి	1.4
గుడ్లూరు	1.2
కావలి	1.2
కొండాపురం	1.2
అనంతసాగరం	1.0
ఏఎస్‌పేట	1.0
కందుకూరు	1.0
ఉలవపాడు	1.0

1007 చెరువుల్లో 39 టీఎంసీల నీరు



బీరాపేరు వాగును పరిశీలిస్తున్న ఎస్ఈ దేశ్ నాయక్

సంగం : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని 1007 చెరువుల్లో సుమారు 39 టీఎంసీల నీరు చేరిందని ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన సంగంలోని బీరాపేరు వాగు, పెన్నా నదిని పరిశీలించారు. మండలంలోని కాలువలు, చెరువుల పరిస్థితిపై ఏఈ వినయ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న చెరువుల్లో 54 టీఎంసీల కెపాసిటీకిగాను 39 టీఎంసీల నీరు చేరినట్లు తెలిపారు. 311 చెరువులు వంద శాతం నిండి కలుజులు పారుతున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే చెరువులు తెగిపోకుండా నూరు శాతం నిండిన చెరువుల తూములను ఎత్తి 30 శాతం ఖాళీ చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. ఆయన వెంట డీఈ పెంచలయ్య, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.



నెల్లూరులో గొడుగులకు భలే గిరాకీ

'సోమశిల'కు తగ్గిన వరద

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రం 51,237 క్యూసెక్కులు వస్తుండగా సోమవారానికి 35,600 క్యూసెక్కులకు పడిపోయింది. గేట్ల ద్వారా దిగువకు సరఫరా చేస్తున్న నీటి మోతాదును తగ్గించారు. 63,460 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా 33,460 క్యూసెక్కులకు కుదించారు. డ్యాంలో 67.212 టీఎంసీలు నిల్వ ఉంచారు.

● నిండుకుండలా 'కండలేరు'

రాపూరు : కండలేరు జలాశయం నిండు కుండలా మారింది. జలాశయంలో 58.97 టీఎంసీల నీరు చేరడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 1900 క్యూసెక్కుల నీటిని పిన్నేరు, సత్యసాయి గంగ కాలువ ద్వారా స్వర్ణముఖి నదికి విడుదల చేస్తున్నారు. వరుస వర్షాలతో జలాశయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 1,450, అవుట్ ఫ్లో 3450 క్యూసెక్కులు ఉన్నట్లు కండలేరు ఏఈ అనిల్ కుమార్ తెలిపారు.

● 'సంగం'లో 90 వేల క్యూసెక్కుల ప్రవాహం

సంగం : బీరాపేరు, బొగ్గేరు వరదతోపాటు సోమశిల నుంచి సోమవారం సుమారు 90 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం సంగం బ్యారేజీకి వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజ్ వద్ద నీటిమట్టం 11.5 అడుగులకు చేరింది. సోమశిల నుంచి విడుదల చేసే నీటిని 62వేల క్యూసెక్కుల నుంచి 37 వేలకు తగ్గించడంతో క్రమేణా బ్యారేజ్ వద్ద నీటి మట్టం తగ్గుతున్నట్లు ఏఈ వినయ్ కుమార్ తెలిపారు. కాగా, 79 గేట్ల ద్వారా దిగువ పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● 'గండిపాళెం' క్రస్ట్‌గేట్లు ఎలా ఉన్నాయ్!

ఉదయగిరి : మండలంలోని గండిపాళెం జలాశయ క్రస్ట్‌గేట్ల పనితీరును సోమవారం జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు క్రస్ట్‌గేట్లు పని చేస్తున్నాయని, ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 11 అడుగులకు చేరినట్లు చెప్పారు. పైతట్టు ప్రాంతం నుంచి వరద వస్తున్నందున నీటిమట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. డీఈ వెంట ఏఈలు సురేష్, వేణు తదితరులు ఉన్నారు.

కూరగాయలండీ.. కూరగాయలో..!

● మొబైల్ వాహనాల్లో విక్రయాలు



నెల్లూరు (వ్యవసాయం) : తుఫాను ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా జిల్లావ్యాప్తంగా మొబైల్ వాహనాల్లో కూరగాయలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం మార్కెటింగ్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా 15 వాహనాలను ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత తెలిపారు. నెల్లూరు, నెల్లూరు రూరల్ నియోజక వర్గాలకు 2, ఆత్మకూరుకు 2, కోవూరుకు 3, కావలికి 3, కందుకూరుకు 3, సర్వేపల్లికి 2 వాహనాలను ఏర్పాటు చేశారు. ఒక్కో వాహనానికి సుమారుగా నలుగురి నుంచి ఐదుగురు సిబ్బందిని నియమించారు. మైకుల్లో అరుస్తూ స్థానికులకు కూరగాయలు విక్రయించారు.



బిట్రగుంట : మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసరెడ్డి



పొదలకూరు : పర్వతాపురం వద్ద పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



ఆత్మకూరు : పెన్నా తీరంలోని బండారుపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో పావని



అధికారులతో చర్చిస్తున్న రమణాదేవి

విద్యుత్ శాఖ అప్రమత్తం

నెల్లూరు (జడ్పీ) : మొంథా తుఫాన్ ప్రభావంతో విద్యుత్ శాఖ పూర్తిగా అప్రమత్తమైంది. సీఎండీ జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్పీడీసీఎల్ జనరల్ మేనేజర్ రమణాదేవి జిల్లాకు ప్రత్యేకాధికారిణిగా నియమించారు. ఆమెతోపాటు మరికొంతమంది అధికారులను నియమించి జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. జిల్లాకు వచ్చిన ఆమె ఎస్ఈ రాఘవేంద్రంతో కలిసి అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు తుఫాన్ ప్రభావం ఉండే తీరప్రాంతాలలో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.(లైన్లు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడితే, వెంటనే మరమ్మతులు చేసేందుకు 1150 విద్యుత్ స్తంభాలు, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 52, 100 కేవీ 54, నాలుగు 160 కేవీ, 47 సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు ఇతర పరికరాలను అందుబాటులో ఉంచారు.

డీఆర్వోగా విజయకుమార్

రామాయపట్నం క్లస్టర్‌కు నలుగురు డిప్యూటీ కలెక్టర్లు

ఎల్‌ఆర్‌ఎస్ గడువు.. 3 నెలలు పొడిగింపు

మద్యం నకిలీనా.. కాదా!?

అందుబాటులోకి ఏపీ సురక్ష ఎక్సైజ్ యాప్

- పూర్తి వివరాలు 8లో..

జన సైనికుల్లో సయోధ్యకు సన్నాహాలు

- మంగళగిరిలో నేటి నుంచి ప్రత్యేక సమావేశం
- నేడు, రేపు 8 మంది చొప్పున హాజరు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీలో ఉమ్మడి నెల్లూరు జిల్లా నాయకుల మధ్య సయోధ్యను కుదిరించేందుకు ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్ సన్నాహాలు ప్రారంభించారు. జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఆయన మంగళ, బుధవారాల్లో జిల్లా నాయకులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఇటీవల జనసేన నాయకుల మధ్య వర్గ విభేదాలు తారస్థాయికి చేరడంతో ఆగ్రహించిన పవన్ ఇరు వర్గాలను మంగళగిరి పార్టీ కార్యాలయానికి పిలిపించి క్లాస్ తీసుకున్నారు. ఈ క్రమంలో జిల్లాలో పార్టీని గాడిలో పెట్టేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌కు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని జనసేన పార్టీలో ఏం జరుగుతుంతో స్పష్టంగా తెలుసుకొని విభేదాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

● జిల్లా నాయకులతో సమావేశాలు

పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు తమ్మిరెడ్డి శివశంకర్ మంగళగిరిలోని తన కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం కానున్నారు. మంగళవారం పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, రీజనల్ కోర్డినేటర్లు కోల విజయలక్ష్మి, నాగరత్నం, కావలి నియోజక వర్గానికి చెందిన అలహరి సుధాకర్, ఆత్మకూరుకు చెందిన నలిశెట్టి శ్రీధర్, గూడూరుకు చెందిన తీగల చంద్రశేఖర్, జిల్లా ప్రధాన

(మిగతా 6లో..)

కంట్రోల్ రూము ఏర్పాటు

రాపూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలను వరదల నుండి రక్షించేందుకు రాపూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ లక్ష్మీ నరసింహం తెలిపారు. రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని, గ్రామస్థాయిలో అధికారులను అప్రమత్తం చేశామన్నారు. సహాయం కోసం 9989502064, 9347109942 నెంబర్లకు ఫోన్ చేయాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని తహసీల్దార్ ప్రజలకు సూచించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11704
వెండి కిలో ధర	రూ. 152242
వెండి ఒక గ్రాము	రూ. 158.20



తుఫాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధం

● తహసీల్దారు స్వప్న

ముత్తుకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వల్ల ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు మండల అధికారులు సిద్ధంగా ఉన్నారని ముత్తుకూరు తహసీల్దారు స్వప్న తెలిపారు. లోతట్టు ప్రాంతాలు తీర గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించామన్నారు. తీర గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించామన్నారు.

?. తుఫాను తీవ్రతను ఎదుర్కొనేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు

!. తీర గ్రామాలు, లోతట్టు ప్రాంతాలలో పరిస్థితులను పరిశీలించాం. రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ఇబ్బందులు లేకుండా చూస్తారు. ఎక్కడైనా ఏదైనా సమస్య ఏర్పడితే మండల కార్యాలయాలకు సమాచారం ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

?. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారా.

!. మండలంలో ఆరు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం. అలిజిపాలెం చలి వేంద్ర కృష్ణపట్నంలో తుఫాను షెల్టర్లలో పునరావాసానికి వసతులు కల్పించాం. పునరావాసానికి వచ్చేవారికి భోజనం, ఇతర వసతులు ఏర్పాటు చేశాం.

?. గ్రామాల్లో తుఫాన్‌పై అవగాహన కల్పించారా.

!. తుఫాను సమయంలో అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని ఆదేశాలు జారీ చేశాం. తీర గ్రామాల్లో వరద నీరు చేరినా, ఇతర సమస్యలు ఉన్నా తక్షణం పునరావాస కేంద్రాలకు తరలివెళ్లండని ప్రజలకు సూచించాం.

అనధికార లేఅవుట్ల దరఖాస్తుల గడువు పొడిగింపు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుండి అనధికార లేఅవుట్లు, స్థలాల నియమావళి 2020 కింద దరఖాస్తుల స్వీకరణ గడువు మరో 3 నెలలు పొడి గించి నట్లు బుచ్చి మున్సిపల్ కమిషనర్ డి బాల కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు నూతన గడువు తేదీ 2026 జనవరి 23 వరకు అన్ని లేఅవుట్లు యజ మానులు, ప్లాట్లు యజమానులు తమ దరఖాస్తులను ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సమర్పించుకోవాలని పేర్కొన్నారు. బుచ్చిలో దరఖాస్తు చేసుకోవాల్సినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కమిషనర్ డి. బాల కృష్ణ పేర్కొన్నారు.

కుంగిన రోడ్డు.. పొంచి వున్న ప్రమాదం!

● పూర్తిగా దెబ్బ తింటే రాపూరు - పొదలకూరు మధ్య రాకపోకలు బంద్

పొదలకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డేగపూడి ఎస్టీ కాలనీ వద్ద ప్రస్తుతం గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొదలకూరు - రాపూరు ప్రధాన రహదారి క్రుంగిపోతోంది. దీంతో ఎస్టీ కాలనీ కల్వర్ట్ వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. వాహనాలు వెళ్తుంటే రోడ్డు స్ప్రింగ్‌లా ఊగుతోందని వాహన చోదకులు, ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. ఇక ఈ మార్గంలో భారీ వాహనాలు తిరిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతానికి తాత్కాలిక ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేశామని, కానీ.. ఏ క్షణం ఏం జరుగుతుందో అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ రోడ్డు పూర్తిగా దెబ్బ తింటే రాపూరుకు రాకపోకలు బంద్ అవుతాయి. రాత్రి సమయాల్లో వాహనాలు తీరా దగ్గరకొస్తే కానీ ఇక్కడ రోడ్డు క్రుంగిపోయిన విషయం తెలియదని డ్రైవర్లు చెబుతున్నారు. ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాలు జరుగుతాయని, ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన రాపూరు - పొదలకూరు ప్రధాన రహదారి

వైభవంగా కార్తీక సోమవారం పూజలు

విడవలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో వెలసివున్న శ్రీ కామాక్షిదేవి సమతే శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామి, అమ్మవార్లకి ప్రత్యేక పూజలను నిర్వహించారు ఆలయ చైర్మన్ అత్తిరాల సురేష్‌కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత ఆలయ పూజారులు శ్రీకాంత్ శర్మ స్వామివారికి రుద్రాభిషేకాలు, అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అత్తిరాల సురేష్‌కృష్ణ మాట్లాడుతూ కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, దాతల సహకారంతో ప్రతి సోమవారం అన్నదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ అడపాల శ్రీధర్ రెడ్డి, తెలుగుయువత నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు ఆవుల వాసు, పొన్నాడి చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు, తెలుగుయువత పాల్గొన్నారు.

కోవూరు : కార్తీక మాస సోమవారం సందర్భంగా స్థానిక పురాతన శివాలయంలో భక్తులు పెద్దసంఖ్యలో పూజలు చేశారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ సాయంత్రం మహిళాభక్తులు ఆలయానికి చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. ధ్వజస్తంభం ఎదుట భక్తిశ్రద్ధలతో కర్పూరహారతులు సమర్పించారు. ఆలయ పూజారి విశ్వనాథం సుబ్బరామయ్య అభిషేకం. పూలంగిసేవ, పల్లకీ సేవ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



కోవూరు : కార్తీక దీపాలు వెల్గిస్తున్న మహిళలు

మనుబోలు: మండలంలోని శైవాలయాలన్నీ భక్తుల శివనామస్మరణతో మారుమ్రోగాయి. చిరుజల్లులు కురుస్తున్నా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా మనుబోలులో ప్రధాన శైవాలయమైన సంగమేశ్వరాలయం, బద్దెవోలు, మనుబోలు శివాలయాల్లో పరమ శివుడికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి అభిషేక, కుంకుమార్చనలను ఆయా దేవాలయాల అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోపేతంగా నిర్వహించారు. మనుబోలు శివాలయంలో సాయంత్రం ఆది దంపతులకు పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా దువ్వూరు సుధాకర్‌రెడ్డి, రాజేశ్వరమ్మ దంపతులు వ్యవహరించారు. పల్లకీసేవకు ముందు భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆకాశదీపంను వెలిగించి స్వామికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

పైడేరు ఛానల్ నుంచి నీటి విడుదల

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్‌కు చేరుతున్న వరద నీటి పరిస్థితిని బట్టి పైడేరు ఎస్కేప్ చానల్ ద్వారా 500నుంచి 2వేల క్యూసెక్కుల మేర నీటి విడుదల చేయనున్నట్టు నీటిపారుదల శాఖ ఎస్ఈ దేశీనాయక్ తెలిపారు. సోమవారం బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్‌ను తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మంజులమ్మతోపాటు ఆశాఖ డీఈఈ, ఏఈఈలతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పైడేరు చానల్ గుండా సుమారు వెయ్యి క్యూసెక్కుల నీటి విడుదల చేయడం జరిగిందన్నారు. నీటి విడుదల నేపథ్యంలో పైడేరు చానల్‌కింద వుండే మండలాల రైతులు అప్రమత్తంగా వుండాలని ఆయన తెలిపారు. ఆయన వెంట ఆశాఖ డీఈఈ పెంచలయ్య, సంగం బ్యారేజి ఏఈఈ వినయ్‌కుమార్, కనిగిరి రిజర్వాయర్ ఏఈఈ శ్రీనివాసులు, ఐసీ సహాయకుడు రవి, ఆశాఖ సిబ్బంది వున్నారు.

గిరిజన బాలుర పాఠశాల సందర్శన

ఇందుకూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొంథా తుఫాన్ కారణంగా ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర స్కూల్‌ను మెడికల్ టీం డాక్టర్ సి.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సందర్శించాఆరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నం దున కాచి చల్లార్చిన నీరు తాగాలని ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తి నప్పుడు వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. హాస్టల్లో పారిశుధ్యం పరిస్థితులు సక్రమంగా ఉంచుకునేందుకు పలు సల హాలు సూచనలు చేశారు. వంటశాలను, మరుగుదొడ్లు పరిశీలించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం ఇందుకూరుపేట నందు అడ్మిట్ కాబడిన ఏకుల కీర్తి గర్భవతి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం జరిగింది. అనంతరం పలువురు గర్భవతుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీహెచ్ సుధాకర్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జనార్ధన్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్‌లు రమా, సతీష్‌బాబు, సీహెచ్‌ఓ నీలిమ, హెల్త్ అసిస్టెంట్లు మాధవ, సుధాకర్, ఏఎన్ఎం సుజాత, పీఈటీ సీహెచ్.మాధవ, తదితరులు పాల్గొన్నారు.



ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

మర్రిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి విద్యార్థి మృతిచెందిన సంఘటన సోమవారం మర్రిపాడు మండలం రామా నాయుడు పల్లిలో చోటుచేసుకుంది. గ్రామంలో జయరాములు, భాగ్యమ్మల కుమారుడు కోనంకి రామ్‌చరణ్ (13) 8వ తరగతి చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి బొగ్గేరులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాస్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేశారు.



రామ్‌చరణ్ మృతదేహం

బైకును ఢీకొన్న కారు

●ముగ్గురికి గాయాలు

రాపూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న కారు ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన సంఘటన మండల పరిధిలోని తూమాయి సబ్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తూమాయిలో తోటలో పని ముగించుకుని స్వగ్రామమైన సిద్ధవరానికి ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పామూరు నుంచి శ్రీకాళహస్తి దేవాలయానికి వెళుతున్న కారు తూమాయి సబ్ స్టేషన్ సమీపంలో వేగంగా వచ్చి బైకును ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలో ఉన్న పెంచలయ్య (55)కు తీవ్ర గాయాలు కాగా, వెనకాల కూర్చున్న పెంచలయ్య మనవడు లోకేష్ (11), అతని స్నేహితుడు చందు (16)కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రు లను మొదట 108లో రాపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడ్డ పెంచలయ్య

బైకు బోల్తా పడి..

వెంకటాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసుమూరు పంచాయతీ పరిధిలోని చింతలపాళెం - వడ్డీపాళెం గ్రామాల మధ్య సోమవారం మోటారు బైకు బోల్తాపడి ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని పద్మావతి సెంటర్ ప్రాంతానికి చెందిన మున్నా, ఇలియాజ్ దైవదర్శనం కోసం కసుమూరు దర్గాకు వెళ్లారు. అక్కడినుండి తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా చింతలపాళెం దాటిన తర్వాత వడ్డీపాళెం సమీపంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్డుపై గుంతలు ఉండడంతో అదుపు తప్పి బైకు బోల్తాపడింది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆటోలో కసుమూరులోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొలాల్లోకి దూసుకెళ్ళిన కారు

జలదంకి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం జమ్మలపాలెం వద్ద కావలి మిల్క్‌లైన్స్ సమీపంలో 167 జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసు కెళ్ళింది. ఈ ప్రమాదంలో కారుకి గానీ అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. కారు పొలాల్లోకి దూసుకెళ్ళిన విధానం చూసి రహదారిపై ప్రయాణిస్తున్న వారు గుంపులుగా చేరి చర్చించుకోవడం ఆ ప్రాంతంలో కనిపించింది. ఈ సమయంలో కారుకు సంభందించిన వారు ఎవరూ ఆ ప్రాంతంలో లేకుండా వెళ్ళిపోయారు.



నీటిలో ఉన్న కారు

ఎన్జీవో ఎన్నికలు ఏకగ్రీవం

రాపూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవో అసోసియేషన్ రాపూరు తాలూకా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. సోమవారం రాపూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా నెల్లూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్కాకుల పెంచలయ్య, సహాయ ఎన్నికల అధకారిగా నల్లగుండ్ల మధు, ఎన్నికల పరిశీలకులుగా ఏవీ కృష్ణ కుమార్ వ్యవహరించారు. 11 పోస్టులకు గాను 11 మంది నామినేషన్లు వేయగా పరిశీలనానంతరం ఏక గ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ కమిటీలో అధ్యక్షులుగా తోట మల్లికార్జున రావు, సహాధ్యక్షులుగా కొడవలూరు విజయశేఖర్, ఉపాధ్యక్షులుగా డి. రాజేంద్ర ప్రసాద్, ఏ.బాలకృష్ణ, ఎం లక్ష్మణ, కార్యదర్శిగా పి.చంద్ర శేఖర్, సంయుక్త కార్య దర్శిగా జే.స్వప్న, కోశాధికారిగా భాస్కర్ లక్ష్మి, డి.సి మెంబర్‌గా తోట నాగయ్య తదుపరి కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలియజేశారు.

స్పిల్ వే దిగువన యుద్ధప్రాతిపదికన పనులు

●ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాం: ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయానికి వరద నేపథ్యంలో స్పిల్ వే ద్వారా నీటిని బయటకు పంపేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంకుపల్లి, పులికల్లు, వెంకటాపురం, పర్వతాపురం గ్రామ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే స్ప్రిల్ వే దిగువన జరుగుతున్న వాగులో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో అధికారులు, టీడీపీ కేడర్ ఉండన్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో కండలేరు జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతుందని, వర్షాలతో జలాశయంలోకి వరద ప్రవాహం పెరిగితే స్ప్రిల్ వే గేట్లు తెరవాల్సిన పరిస్థితి వస్తుంద న్నారు. ఇక్కడి పరిస్థితిని కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వివరించామని, నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టారన్నారు. స్ప్రిల్ వే దగ్గర నుంచి కండలేరు వాగు వరకు ప్రవాహం సాఫీగా సాగేందుకు అవసరమైన పనులు చేపట్టేందుకు రూ.95 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. తహసీల్దారు శివకృష్ణయ్య, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతోపాటు టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, పులిపాటి వెంకటరత్నంనాయుడు, బొద్దులూరు మల్లి కార్జున్ నాయుడు, నెట్టెం పెంచలనాయుడు, పెంచలనాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, దేవి నేని శరత్, రాజశేఖర్‌రెడ్డి, అలుపూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులను అప్రమత్తం చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

'మొంథా' ముప్పును ఎదుర్కొందాం!

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను వస్తే ఎదుర్కొనేందుకు, సహాయ కార్యక్రమాల్ని అందించేందుకు నియోజకవర్గ పరిధిలోని అధికారులందరూ సిద్ధంగా ఉండాల్సిందిగా సోమవారం శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. మొంథా తుపాను హెచ్చరికల్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. న్నారు. నియోజకవర్గ పరిధిలో పెన్నానది పొర్లు కట్టలు పలుచోట్ల బలహీనంగా ఉన్నాయన్నారు. అలాంటి చోట్ల రెవిన్యూసిబ్బంది ప్రజానీకాన్ని అప్రమత్తం చేయాలన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల లో తట్టు, తీరప్రాంతాల ప్రజానీకం నష్టపోకుండా చూడాలన్నారు. ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల్ని గుర్తించి తహసీల్దార్లు, వీఆర్వోలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సహాయక శిబిరాల్లో ఆహారం, నీరు సిద్దంగా ఉంచాలన్నారు. ఆకస్మికంగా వరదలు సంభవిస్తే పెన్నానది పొర్లుకట్టలు, చెరువు గట్లు తెగే ప్రమాదమున్నందు వల్ల ఇసుక బస్తాలు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, అధికారులుఅందుబాటులో ఉండాల్సిందిగా కోరారు. అత్యవసర సహాయం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోలు రూమ్ నంబర్లుకు 0861-2331261, 7995576699 ఫోను చేయాల్సిందిగా కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

అదృశ్యమైన విద్యార్థులు తల్లిదండ్రుల చెంతకు...

నెల్లూరురూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ఇటీవల అదృశ్యమైన ఇద్దరు పదవ తరగతి విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు రూరల్ సీఐ గుంజి వేణు సోమవారం తెలిపారు. ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య స్కూల్ హాస్టల్‌లో ఉండి పదో తరగతి చదువుతున్న లోకేష్, రాకేష్‌లు ఇటీవల అదృశ్యమయ్యారని, హాస్టల్ ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో వారు హాస్టల్ నుంచి తిరుపతికి వెళ్లి అక్కడి నుంచి గూడూరుకు వచ్చి రైల్వే స్టేషన్‌లో ఉండగా అక్కడి పోలీసులు గుర్తించి తమకు సమాచారం అందచేశారని చెప్పారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

వెంకారెడ్డి మృతదేహం గుర్తింపు

● వెలికితీసిన గజ ఈతగాళ్లు

బిట్రగుంట, అక్టో బరు 27 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మం డలం ముంగ మూరు లో మూడు రోజుల క్రితం కనిపించకుం డాపోయిన కేతిరెడ్డి వెంకారెడ్డి (75) మృత దేహం సోమవారం లభ్యమైంది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. శనివారం ఉదయం వెంకారెడ్డి బహిర్భూమికని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన కుమారుడు కేతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పోలీసులకు ఫి ర్యాదు చేశాడు. ఎస్ఐ ఎన్ ప్రభాకర్, సిబ్బంది పలుచోట్ల వెతికారు. ఆదివారం గజ ఈతగాళ్ళ గాలించగా సోమవారం ఉదయం వెంకా రెడ్డి మృతదేహం లభ్యమైయిందని పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తర లించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

అప్రమత్తమైన అధికారులు, నాయకులు

ముత్తుకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాను తీవ్రత అధికంగా ఉండ వచ్చన్న సూచనలతో మండల అధికారులు అప్రమ త్తమయ్యారు. మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్ లోతట్టు ప్రాంతాలలో పర్యటించి పరిస్థితులు సమీక్షించారు. చలివేంద్ర, బలిజపాలెం, కృష్ణపట్నంతో పాటు ముత్తుకూరు ఎరుకుల కాలనీకి వెళ్లి స్థాని కులతో మాట్లాడి పరిస్థితులను పరిశీ లించారు. తుఫాను వల్ల కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు ఏర్పడితే తక్షణం సమీప పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూ చించారు. ముత్తుకూరు ఎరుకుల కాలనీ వాసుల కోసం పక్కనే ఉన్న చేపల మార్కెట్ తాళాలు తెరిపించి సిద్ధం చేశారు. మండ లంలో ఏర్పాటు చేసిన పునరావాస కేం ద్రాల్లో భోజనం వసతులపై వాకబు చేశారు. తుఫాను నేపథ్యంలో లోతట్టు గ్రా మాల ప్రజలు ఇబ్బందిపడకుండా ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటుందన్నారు.

బుచ్చిలో హెల్ప్‌లైన్ డెస్క్

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి: మంథా తుఫాన్ ప్రభావంతో ప్రజలకు ప్రభుత్వంనుంచి అందించే సహాయ, సహకారాల మేరకు హెల్ప్ లైన్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు కమిషనర్ బాలకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీలో త్రాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, అంతరాయం కలిగిన వారు హెల్ప్‌లైన్ డెస్క్‌కు ఫోన్ చేసి తక్షణ సహాయ, సహకారాలు పొందాలని సూచించారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

మనుబోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సోమవారం రాత్రి జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.ఖాదర్‌వల్లీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా, లేదా పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. తుఫాన్ ప్రభావం కారణంగా మూడు రోజుల పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధులు సక్రమంగా నిర్వహించి, ప్రణాళికలు వేసుకుని పనిచేయాలని సిబ్బందికి సూచించారు.



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డా. ఖాదర్‌వలీ

ఏటీఎస్ సెంటర్లు రద్దు చేయాలి

బుచ్చిలో సీఐటీయూ ఆటో కార్మికుల ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): రవాణా వాహనాలపై అధిక భారాలు మోపే ఏటీఎస్ సెంటర్లు రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు బుచ్చిలో సీఐటీయూ కార్యాలయం నుంచి ఆటో కార్మికులతో ర్యాలీ నిర్వహించి తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. రవాణా వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను ఆర్టీఏ అధికారులనుంచి కాకుండా ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం రవాణా వాహనాలపై అధికభారం మోపడమేనన్నారు. ఏటీఎస్ సెంటర్‌ల వల్ల ఫీజు అదనంతోపాటు సమయానికి వారు రాకుంటే స్లాట్ రద్దై మళ్ళీ డబ్బులుకట్టి స్లాట్ బుక్ చేసుకోవాల్సివస్తుందన్నారు. ఈ ఆసరాతో బ్రోకర్లు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ఎటీఎస్ సెంటరు రద్దు చేసి ఆర్‌టీఏ అధికారులే ఎఫ్సీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నిండుకున్న చెరువులు, వాగులు

మనుబోలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా మండలంలో సోమవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి.చిత్తడి వానకు వీధులు రొచ్చురొచ్చుగా మారాయి. ఈదురుగాలులు వీయకపోవడంతో ఎక్కడా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలు జరగలేదు. చెరువులు, వాగులు ఎగువనుంచి వచ్చే నీటితో మరింత నిండుకుంటున్నాయి. రెవెన్యూ, కరెంటు, పంచాయతీరాజ్ అధికారులతో పాటు పోలీసులు పలు గ్రామాలను పర్యటించి ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయా, లోతట్టు ప్రాంతాలకు ఏమైనా నీరు చేరిందా పరిశీలించారు. వడ్లపూడి వద్ద చెరువు కలుజు పూడిపోవడాన్ని అధికారులు గుర్తించారు. డీటీ ప్రదీప్, ఎంపీడీవో జలజాక్షి, ఆర్ఐ. అరుణ్‌బాబు, విఆర్‌వో గుణశేఖర్ లు ఎస్కవేటర్‌సాయంతో దగ్గరుండి కలుజుపూడికతీత పనులు చేయించి సాగునీరు వెళ్ళేలా చర్యలు తీసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తక్షణమే స్పందించిలే అన్ని శాఖల అధికారులు సిద్దంగా ఉన్నారని డీటీ ప్రదీప్ తెలియజేశారు.

బుచ్చిలో 7 పునరావాస కేంద్రాలు

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మంథా తుపాను హెచ్చరికతో కలెక్టర్, సీఎం, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న భద్రతా చర్యల్లో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం మండలంలో గతంలో వరదలు వచ్చిన ప్రాంతాలలో 7 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు సోమవారం తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేరకు మండలంలోని పెన్నా పరీవాహక ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలైన మినగల్లు జడ్‌పీ హైస్కూలు, పెనుబల్లి జడ్‌పీ హైస్కూలు, జొన్నవాడ ఎంపీపీ పాఠశాల, కాళయకాగొల్లు, శ్రీరంగరాజుపురం, దామరమడుగు, ఇస్కపాళెం పరిధిలోని పోలినాయుడు చెరువు గ్రామాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు గ్రామ సచివాలయాలు, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు ఆయన తెలిపారు. మండలంలో ఆదివారం 86.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు తెలిపారు. ప్రధానమైన కనిగిరి రిజర్వాయర్‌లో పూర్తి నీటి సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా 2.1 టీఎంసీలు వున్నట్టు ఆయన తెలిపారు. అడుగుల్లో 21 కాగా ప్రస్తుతం 18.9వున్నట్టు తెలిపారు. 19అడుగులు దాటితే ఇరిగేషన్ అధికారుల నిర్ణయం మేరకు మలిదేవి డ్రైన్‌కు విడుదల చేయనున్నట్టు ఆయన తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

విడవలూరు : ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఊటుకూరు కంచరపాళెం సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు కథనం మేరకు.. ఊటుకూరు నుంచి రామతీర్థం గ్రామానికి మోటారు వాహనంపై వస్తున్న కాటంగారి శివాజీని గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో శివాజీ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు 108కి ఫోన్ చేసినా రావటానికి ఆలస్యం కావటంతో, స్థానిక టీడీపీ, మత్స్యకార నాయకుడు ఆవుల వాసు తన కారులో క్షతగాత్రుడిని నెల్లూరులోని ఆసుపత్రిలో చేర్పించారు. దీంతో ఆవుల వాసుని స్థానికులు అభి నందించారు.

వీఎస్‌యూలో ఇంటర్వ్యూలు 30కి వాయిదా

వెంకటాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని కావలి పీజీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో ఉద్యోగాల భర్తీకి జరగాల్సిన ఇంటర్వ్యూలు ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ కే సునీత ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూల ద్వారా ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నాన్ టీచింగ్ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీన వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని సూచించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	133
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 575

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు పతకాలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన 38వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్-50 పురు షుల విభాగంలో ఏ.శ్రీనివాసులు బంగారుపతకం, అండర్-24 మహిళల విభాగంలో ఎస్.లీనా రజితపతకం, అండర్-14 బాలుర విభాగంలో ఎస్.సాధన బంగారుపతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు బాపట్లలో డిసెంబర్ 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా యోగా క్రీడా అసోసి యేషన్ కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు అభినందించారు.





ఖాళీగా ఉన్న వైద్య మిత్ర ఓపీ

నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో
అందని వైద్యం!

- 17 రోజులుగా యాజమాన్యాల సమ్మె
- 13 వైద్యశాలల్లో ఆగిన సేవలు
- నానా అవస్థలు పడుతున్న రోగులు
- ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు



నెల్లూరు(వైద్యం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ కింద వైద్య సేవలు అందించే ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు జిల్లాలో 32 ఉన్నాయి. అయితే 6వ తేదీ నుంచి ఆయా నెట్‌వర్క్ ఆసుపత్రులు తమకు ప్రభుత్వం నుంచి బకాయిలు ఉన్నాయని సమ్మెకు పిలుపు నిచ్చాయి. దీంతో ఈనెల 6వ తేదీ నుంచి ఓపీ సేవలు నిలిపి వేశాయి. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఈనెల 10వ తేదీ నుంచి పూర్తిగా వైద్య సేవలు నిలిపి వేసి సమ్మెలోకి వెళ్లాయి. జిల్లాలో ఉన్న 32 నెట్‌వర్క్ ప్రైవేట్ ఆసుపత్రిలో 13 ఆసుపత్రులు ఈ నిరవధిక సమ్మెలో ఉండగా మిగిలిన నెట్‌వర్క్ ఆసుపత్రులు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సమ్మె కారణంగా ఎన్టీఆర్ వైద్య సేవలు అపేసిన నెట్‌వర్క్ ఆసుపత్రులలో సేవలు అందుబాటులో లేక పోవడంలో రోగులు ఆయా ఆసుపత్రులకు వెళ్లి అక్కడ వైద్య సేవలు లేకపోవటంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు అందుబాటులో ఉన్న వాటికి తిరుగు ప్రయాణం అవుతున్నారు. దీని వల్ల రవాణా చార్జీలు తడిచి మోపుడవుతున్నాయి. ఇందులో కొంత మంది అత్యవసర రోగులు నానా అవస్థలు పడుతున్నారు. సమ్మెలో ఉన్న 13 ప్రైవేట్ ఆసుపత్రులలో అరవింద్ కిడ్నీ సెంటర్, మెడికవర్ ఆసుపత్రి, విజయకృష్ణ ఆసుపత్రి, అనసూయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రవి చిన్నపిల్లల ఆసుపత్రి, రెయిన్‌బో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, డాక్టర్ విజయ మెమోరియల్ నెల్లూరు ఆసుపత్రి, మధు నేత్రాలయ, సుశీలా నేత్రాలయ, విజయాకేర్ మల్టికేర్ ఆసుపత్రి, ఎనెల్ ఆసుపత్రి, డాక్టర్ రాజశేఖర్ కంటి ఆసు పత్రి, మాడరన్ కంటి ఆసుపత్రి అండ్ రీసెర్చ్ సెంటర్‌లు ఉన్నాయి.

● ఈ క్రమంలో జల దంకి మండలం చామదలకు చెందిన నిరుపేద రైతు శ్రీరాము లు గుండె నొప్పితో నెల్లూరులోని ఓ ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఉన్న ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ఆసుపత్రి యాజమాన్యం సమ్మె లో ఉండటంతో ఎన్టీఆర్ వైద్యసేవ కింద చికిత్స చేయలేమని చెప్పారు. ఏ ఆసుపత్రి ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ కింద చికిత్సలు అందిస్తారని అక్కడి ఆరోగ్య మిత్రను అడగటంతో నారాయణ ఆసుపత్రికి తీసుకువెళ్లమని సలహా ఇచ్చారు. అయితే అప్పటికే ఆలస్యమైనా వెంటనే నారాయణ ఆసుపత్రికి తరలించటంతో అక్కడి వైద్యులు ప్రత్యేక చికిత్స అందించడం ద్వారా బాధితు డు శ్రీరాములు కోలుకున్నారు.

● జిల్లాలో రూ. 200 కోట్లకు పైగా బకాయిలు

ఇదిలా ఉంటే జి ల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవ కింద రాష్ట్రంలోని నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ. 2100 కోట్లు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రు లతో కలిపి రూ.200 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదలకు సుముఖంగా ఉన్నా నెట్‌వర్క్ ఆసుపత్రుల అసోసియేషన్(ఆశా) ఇందుకు ససేమిరా అంటుంది. కనీసం చెల్లించాల్సి బకాయిలలో సగమైనా చెల్లించాలని పట్టు పడుతోంది. ప్రతిసారి సమ్మె కారణంగా ఏదో మొక్కుబడిగా కొంత మొత్తం విడుదల చేయటమే తప్ప శాశ్వత పరిష్కారం లేదంటూ ప్రభుత్వ విధానాలపై నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు గుర్రుగా ఉన్నారు. ఒక్క నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికే రూ.88 కోట్ల చెల్లించాల్సి ఉండగా మిగిలిన ఆసుపత్రులకు కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో నెట్‌వర్క్ ఆసుపత్రులు సమ్మెలో ఉండటంతో రోగులు నానా అగచాట్లు పడుతున్నారు. త్వరగా సమ్మె ముగించి వైద్య సేవలు పునరుద్ధరించాలని రోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సమ్మె ఉధృతం చేస్తాం



ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాలేదు. తమ సమ్మెతో కొంత స్పందంచి రూ. 250 కోట్లు విడుదల చేస్తామని చెబుతోంది. అయితే రూ.2100 కోట్లలో సగమైనా ఇవ్వాలని అడుగుతున్నాం. దానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంతో సమ్మెను కొనసాగిస్తున్నాం. తమ సమ్మెకు మద్దతు ఇవ్వాలని రాష్ట్రంలోని ప్రైవేట్ వైద్య కళాశాలలతో మాట్లాడుతున్నాం. అయితే రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తున్నా వైద్యులు, సిబ్బంది వేతనాల కోసం ఈ సమ్మెను కొనసాగిస్తున్నాం.

- డాక్టర్ నారాయణ రావు, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

● ఎన్ఎంసీ కమిషనర్ నందన్


ప్రైవేట్ ఏజెన్సీల నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగంతో సిద్ధంగా ఉన్నట్లు ఎన్ఎంసీ కమిషనర్ నందన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కార్యాలయంలో పలు విభాగాలు, ప్రైవేట్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో విపత్తును ఎదుర్కొని, ప్రజలకు అండగా నిలచేందుకు 4 డివిజన్లకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో కీలకమైన విభాగాలన్నింటికి బాధ్యతలు అప్పగించామన్నారు. నగర వ్యాప్తంగా 14 మున్సిపల్ పాఠశాలల్లో సహాయక పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెల్లూరులో విపత్తు వల్ల ఎక్కడైనా ఎలాంటి ఇబ్బంది ఏర్పడినా, సహాయం కావాల్సి వచ్చినా కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ 0861-2356777, 2316777లను సంప్రదించాలని సూచించారు. ఇది పూర్తిగా అందుబాటులో ఉంటుందన్నారు. అనుమతులు లేకుండా ఎవరు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు ప్రింట్ చేసే నిర్వాహకులు కార్పొరేషన్ అనుమతులు పరిశీలించాలని తెలిపారు. గాలితో కూడిన వర్షం పడే అవకాశాలున్నందున ఫ్లెక్సీలు 48 గంటల్లోపు తొలగించాలన్నారు.

నగరంలో ముందస్తు చర్యలు

● లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తం ● పెన్నా పొర్లుకట్టలు పరిశీలించిన గిరిధర్‌రెడ్డి


పొర్లుకట్టను పరిశీలిస్తున్న టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరు(సిటీ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : దూసుకువస్తున్న మొంథా తుపాను ముప్పు నెల్లూరుకు ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో నగరంలో అధికార యంత్రాంగం ముందస్తు నివారణ చర్యలు చేపట్టారు. సోమవారం రోజంతా వర్షం పడడంతో అధికారులు నగరంలో 14 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాలన్నింటిల్లోనూ వరద ప్రవాహం బయటకు వెళ్లేందుకు మార్గాలు ఏర్పాటు చేశారు. అవసరమైనమేరకు ఆయా ప్రాంతాలలోని వరద బాధితులను తరలించేందుకు కార్పొరేషన్ యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే గుర్తించిన పునరావాస కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని అండర్ బ్రిడ్జీలు, ప్రధాన కూడళ్లు, రోడ్లు, వరద ప్రభావిత ప్రాంతాలలో వర్షం నీరు వేగంగా బయటకు వెళ్లేందుకు ప్రధాన కాలువల్లో పూడిక తీశారు. హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగించాలని సంబంధిత యాజమాన్యాలకు సూచించిన అధికారులు, ప్రమాదమైన చోట్ల చెట్ల కొమ్మలను తొలగింపు చర్యలు చేపట్టారు. నెల్లూరులోని కొంత భాగం పెన్నా పొర్లుకట్ట ద్వారా వరద నీరు వచ్చే అవకాశాలుండటంతో పొట్టేపాళెం, పొర్లుకట్ట, మనమసుద్దీన్‌నగర్ ప్రాంతాలలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. వరద భారీగా వస్తే తక్షణం తీసుకోవాల్సిన చర్యలు, ప్రభావిత ప్రాంతాల వారిని తరలింపు పై ఆయన పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు.

47వ డివిజన్‌లో చెట్ల తొలగింపు


చెట్ల కొమ్మలను తరలిగిస్తున్న అధికారులు, నాయకులు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని 47వ డివిజన్‌లో మొంథా తుపాను నేపథ్యంలో సోమవారం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ కుమార్ బృందం రోడ్డుపై అడ్డంగా ఉన్న చెట్లు, కొమ్మలను తొలగించారు. తుపాను ప్రభావంతో విరిగే అవకాశం ఉన్న వాలిన విద్యుత్ స్తంభాలు, లూజు వైర్లను సరిచేశారు. నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగేలా చర్యలు చేపట్టారు. 11 కేవీ ఎల్‌టీ లైన్‌లను మరమ్మతులతో పాటు విద్యుత్ తీగలు తెగకుండా విద్యుత్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మాబాషా, నీలకంఠం, మునికృష్ణ, విద్యుత్‌శాఖ అధికారులు విజిల్‌రెడ్డి, షరీఫ్, శివ, జమీల్, మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ ఆశీర్వాదం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, శానిటరీ సెక్రటరీ మాసెస్ తదితరులు పాల్గొన్నారు.

కలుజుల వద్ద జాగ్రత్తగా ఉండాలి : రూరల్ సీఐ


పొట్టేపాళెం కలుజు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు

నెల్లూరురూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్లోని పొట్టేపాళెం, ములుముడి ప్రాంతాల వద్ద కలుజుపై ప్రయాణించే వారు అత్యంత జాగ్రత్తగా వెళ్లాలని రూరల్ సీఐ గుంజి వేణు సూచించారు. సోమ వారం తుఫాన్ హెచ్చరికల నేపథ్యం లో వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేశారు. కలుజుపై వరద నీరు వేగంగా వెళ్తున్నాయని, కార్లు, జీపులు, ద్విచక్ర వాహనదారులు నెమ్మదిగా మరో వ్యక్తి సహాయంతో వెళ్లాలన్నారు. అక్కడ పోలీసు పహరా ఏర్పాటు చేశామన్నారు. దీన్‌దయాళ్‌నగర్, దొరతోపుకాల నీల వద్ద ప్రజలను అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రెండు పోలీసు బృందాలు సుదీర్ఘంగా పర్యటిస్తునే ఉన్నాయని, ఎలాంటి ఇబ్బంది వాటిల్లిన కలెక్టరేట్ కంట్రోల్ కేంద్రానికి సమాచారం అందచేయాలని సూచించారు.

'నారాయణ'లో పేరెంట్స్, స్టూడెంట్స్ కార్యక్రమం

నెల్లూరు(విద్య), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామలింగాపురం నారాయణ పాఠశాలలో సోమవారం పేరెంట్స్, స్టూడెంట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1, 2వ తరగతుల విద్యార్థులు మొదటి టర్మ్‌లో నేర్చుకున్న న్యూమరిక్, లిట్రసీ, రెయిమ్స్, స్టోరీస్ వంటి అంశాలను తల్లిదండ్రుల ముందు ప్రదర్శించారు. దీనిపై తల్లిదండ్రులు స్వయంగా విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలపై ప్రశ్నించి తమ సందేహాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం నరేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్స్ వెంగళరావు, సోనీ, వైస్ ప్రిన్సిపాల్స్ వెన్నెల, సల్మా, బిందు, ఏవో శివరంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని బృందావనం మొయిన్ రోడ్డులో ఉన్న ఫిలిక్స్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈనెల 29వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మెదడు, వెన్నుముఖ, నరముల వైద్య నిపుణులు డాక్టర్ వైష్ణవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ పక్షవాత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉచిత ఓపి కన్సల్టేషన్‌తో పాటు బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. ఉదమం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

ఓం నమః శివాయ!

● శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
● విశేష అలంకారాలు, ప్రాకారోత్సవాలు


స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలతో శివలింగం ఆకృతి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలో కార్తీక మాసం తొలి సోమవారం వేడుకలు కనుల పండువగా జరిగాయి. శివదర్శనం కోసం భక్తులు సూర్యోదయానికి ముందుగానే ఆలయాల వద్ద బారులుతీరారు. మొంథా తుపాను ప్రభావంతో వర్షం కురుస్తున్నా అంకుటిత దీక్షతో స్వామివారికి పాలాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో భక్తులు సూర్యోదయానికి ముందుగానే ఆలయానికి చేరుకుని పాలాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సహస్ర నామార్చనలు చేశారు. సాయంత్రం మూలస్థానేశ్వర స్వామికి భువనేశ్వరికి విశేష పూలంగిసేవ అలంకారం జరిగింది. శివ భక్తుల భజనలు మారుమోగాయి. రాత్రి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం శివపార్వతులకు ప్రాకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, అర్చకులు పర్యవేక్షించారు.

● రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వర స్వామికి కార్తీక మాసం సందర్భంగా సోమవారం విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ప్రధాన అర్చకులు రఘురామమూర్తి ఆధ్వర్యంలో 108 బిందెలతో అభిషేకాలు, అనంతరం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, జరిగాయి. రాత్రి కార్తీక దీపారాధన, స్వామివారికి కుంభ హారతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాశివుడికి మహాన్యాస రుద్రాభిషేకాలు, విశేష అలంకారం పూజలు జరిగాయి. కన్యకాపరమేశ్వరికి నిత్యపూజలు, ప్రత్యేక అలంకారం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోటగురుబ్రహ్మం, కార్యనిర్వహక అధ్యక్షుడు పేగు.షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● పొగతోట ఆదిశంకరా ధ్యాన మందిరంలో భవానీ శంకరస్వామికి, కార్తీక దామోదరస్వామికి, ఆదిశంకరాచార్యులకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ఏకాదశ పూర్ణావారా బిషేకాలు, శివార్చనలు, పుష్పార్చనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్షులు గుండాపంతుల రామసుబ్రహ్మణ్యశర్మ, చక్రాల ఆనందకుమార్, మల్లవరపు లక్ష్మీనరసింహశర్మ, సమయానంద స్వామి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

● మూలాపేట గణేష్ ఘాట్‌లో స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రాత్రి కార్తీక దీపారాధనలు, సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ.సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ 5, 6, 7 తేదీల్లో గణేష్ ఘాట్ వద్ద కార్తీక దీపోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 6వతేదీ జరిగే సత్యనారాయణవ్రతంకు అన్నవ రం నుంచి ఉత్సవమూర్తులతో వ్రతం నిర్వహిస్తున్నామని తెలిపారు. సింహపురి ప్రజలందరూ ఈ వ్రతంలో పాల్గొనాలని కోరారు. అలాగే మూలాపేట మల్లేశ్వరాలయం, నవాబుపేట మల్లేశ్వరాలయం, ఉస్మాన్‌సాహెబ్ పేట కాశీవిశ్వ నాథస్వామి ఆలయం, హౌసింగ్ బోర్డు అష్టలక్ష్మీ ఆలయం, వాహబుపేట, మూలాపేట శంకర మఠాల్లో ఉమామహేశ్వర స్వాములకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, శివార్చనలు, ప్రత్యేక అలంకారాలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీల పట్ల వివక్ష తగదు

● నేడు కావలిలో బీసీ ఐక్యతభవన్ ప్రథమ వార్షికోత్సవం

కావలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో 52 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీల పట్ల రాజకీయపార్టీలు వివక్ష చూపుతున్నాయని బీసీ ఐక్యతభవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్‌రావు తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రభాకర్‌రావుతో పాటు ఆ భవన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయుడు పరిశుద్ధరావు, గౌరవాధ్యక్షుడు ఉరిటి గోవింద్, సహాయ కార్యదర్శి కోడింగారి శ్రీను, వ్యవస్థాపక అధ్యక్షుడు చిన్ని వరప్రసాద్‌రావు మాట్లాడారు. బీసీ ఐక్యత భవన్ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం కావలిలో జరుగుతుందని, బీసీ నాయకులు, బడుగుబలహీన వర్గాల ప్రజలు, మైనార్టీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, కులగణన, రాజకీయాలలో బీసీల వాటా తదితర అంశాలపై చర్చిస్తామని ఆయన తెలిపారు.

బస్‌స్టేషన్‌లో వసతులు కల్పిస్తాం : జోనల్ చైర్మన్

సీతారామపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయాల ఎదురుగా ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికుల కోసం తాగునీరు, మరుగుదొడ్ల తదితర అన్ని సౌకర్యాలు కల్పించి, బస్‌స్టేషన్‌ను వినియోగంలోకి తెస్తామని ఏపీఎస్ ఆర్టీసీ డైరెక్టర్, జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం సురక్షితమన్నారు. కడప, ప్రకాశం జిల్లాల సరిహద్దు మండలమైన ఈ ప్రాంతం నుంచి సి.ఎస్. పురం, పోరుమామిళ్లకు అదనపు బస్సుల సౌకర్యం కలిగించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్, బిజెపి నాయకులు మేకపాటి మాల్యాద్రి నాయుడు, గెట్టిబోయిన వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి, తోట ఏడుకొండలు, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

బిట్రగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో మొంథా తుపాను ప్రభావం వల్ల తూర్పు తీరప్రాంత సముద్రంలో సోమవారం అలలు ఎగసిపడుతున్నాయి. తెల్లవారుజామునుంచి గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు తీరప్రాంతప్రజలను అప్రమత్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, గుంటలు దాదాపు నిండుకుండల్లా ఉన్నాయి.

100 రైలు సర్వీసుల రద్దు!

● మొంథా తుఫాన్ ఎఫెక్ట్.. రవాణా బంద్ ● రైళ్లన్నీ ఎక్కడివి అక్కడే నిలిపివేత

విజయవాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం కారణంగా మంగళవారం కోస్తా జిల్లాల మీదుగా నడిచే 95 రైళ్ల సర్వీసులను విజయవాడ డివిజనల్ రైల్వే రద్దు చేసింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైళ్లు రద్దు చేసినట్టుగా ప్రకటించింది. ఈ మేరకు వేర్వేరుగా మూడు బులెటిన్లు విడుదల చేసింది. వీటితో పాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో.. విజయనగరం, విశాఖపట్నం మీదుగా రాజమండ్రి, మచిలీపట్నం, గుంటూరు, తిరుపతి, చెన్నై, సికింద్రాబాద్‌లకు వెళ్లే కొన్ని రైళ్లను రద్దు చేశారు. దీంతో కోస్తా జిల్లాల పరిధిలో 100కు పైగా రైలు సర్వీసులు రద్దు కావడం గమనార్హం.

● రద్దు చేసిన రైళ్ల వివరాలు..

విజయవాడ-భీమవరం టౌన్(67281), భీమవరం టౌన్-నిడదవోలు (67283), నిడదవోలు-భీమవరం (67284), భీమవరం టౌన్-విజయవాడ(67282), విజయవాడ-రాజమండ్రి (67262), గుంటూరు-విజయవాడ(67230), విజయవాడ-కాకినాడ పోర్టు(17257), కాకినాడ పోర్టు-రాజమండ్రి(07523), విజయవాడ-తెనాలి (67221), తెనాలి-రేపల్లె (67231), రేపల్లె- తెనాలి (67232), తెనాలి-రేపల్లె (67233), రేపల్లె-గుంటూరు (67234), గుంటూరు-తెనాలి (67235), తెనాలి-రేపల్లె (67237), రేపల్లె-మార్కాపూర్ రోడ్డు(67238), మార్కాపూర్ రోడ్డు-తెనాలి(67239), తెనాలి-గుంటూరు(67236), గుంటూరు -విజయవాడ(67230), విజయవాడ-మచిలీపట్నం(67265), మచిలీపట్నం-గుడివాడ(67271), గుడివాడ-మచిలీపట్నం (67272), మచిలీపట్నం- విజయవాడ(67266), విజయవాడ- నర్సాపూర్ (67258), నర్సాపూర్-రాజమండ్రి(67246), విజయవాడ-రాజమండ్రి (67202), విజయవాడ-ఒంగోలు(67273), ఒంగోలు-విజయవాడ (67274), విజయవాడ-మచిలీపట్నం (67267), మచిలీపట్నం- విజయవాడ(67268), నర్సాపూర్- విజయవాడ(67276), విజయవాడ-మచిలీపట్నం(67269), భీమవరం టౌన్-నిడదవోలు(67277), నిడదవోలు-భీమవరం టౌన్(67278), భీమవరం టౌన్-నర్సాపూర్(17263), నర్సాపూర్-గుంటూరు(67247), గుంటూరు-రేపల్లె(67249), రేపల్లె- గుంటూరు (67250), మచిలీపట్నం-విజయవాడ(67256), విజయవాడ-నర్సాపూర్ (67257), నర్సాపూర్-నిడదవోలు (67244), నిడదవోలు-నర్సాపూర్ (67245), విజయవాడ- మాచెర్ల(67227), మాచెర్ల-విజయవాడ (67228), రాజమండ్రి-విజయవాడ(67201), రాజమండ్రి-విశాఖపట్నం (67285), విశాఖపట్నం-రాజమండ్రి (67286), రాజమండ్రి- విజయవాడ (67261), రాజమండ్రి -భీమవరం టౌన్(67241), భీమవరం టౌన్-నిడదవోలు (67242), నిడదవోలు-నర్సాపూర్ (67243), కాకినాడ పోర్టు-విజయవాడ(17258), కాకినాడ పోర్టు-విశాఖపట్నం(17267), విశాఖపట్నం-కాకినాడ పోర్టు (17268), తిరుపతి-విశాఖపట్నం(08584), విశాఖపట్నం-గుంటూరు(22875), గుంటూరు-విశాఖపట్నం(22876), తిరుపతి-విశాఖపట్నం(22708), మచిలీపట్నం- విశాఖపట్నం (17219), హైదరాబాద్-విశాఖపట్నం(12728), మహబూబ్ నగర్-విశాఖపట్నం(12862), చెన్నై సెంట్రల్-విశాఖపట్నం (22870), భువనేశ్వర్-బెంగుళూరు(18463), సికింద్రాబాద్-విశాఖపట్నం(12740), భువనేశ్వర్-సికింద్రాబాద్(17015), భువనేశ్వర్-పాండిచ్చేరి(20851), విశాఖపట్నం-కాకినాడ పోర్ట్ (17268), కాకినాడ పోర్ట్-విశాఖపట్నం(17267), లింగంపల్లి -విశాఖపట్నం(12806), చర్లపల్లి-షాలిమార్ (18046), నర్సాపూ ర్ -భీమవరం(17264), సికింద్రాబాద్-భువనేశ్వర్(17016), సికింద్రాబాద్-హౌరా (12704), గుంటూరు-రాయగడ(17243), రాయగడ-గుంటూరు(17244), హైదరాబాద్-భువనేశ్వర్ న్యూ(07165), భువనేశ్వర్ న్యూ-హైదరాబాద్(07166), తిరుపతి-పూరి (17480), పూరి-తిరుపతి(17479), కడప- విశాఖపట్నం (18522) తదితర రైళ్లను రద్దు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

ఇంటి స్థలం ఆక్రమణలను అడ్డుకుని న్యాయం చేయండి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తమ ఇంటి స్థలం ఆక్రమణలను అడ్డుకుని తమకు న్యాయం చేయడంతోపాటు ప్రాణ రక్షణ కల్పించాలని తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త యాట శ్రీనివాసులు దంపతులు కోరారు. సోమవారం జర్నలిస్టు భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో తమకు ఇంటి స్థలం ఉందని, దానిని తమ గ్రామానికి చెందిన యాట వెంకటరమణయ్య, శంకరయ్యలు ఆక్రమిస్తున్నారని, అడ్డుకుంటే చంపేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీనిపై టీపీ గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు తమ సమస్యను పట్టించుకుని మా కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



నెల్లూరు : మూలపేట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు





హరహర శంభో శివశంభో

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● సముద్ర స్నానాలు బంద్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం తొలి సోమవారం వేడుకలు జిల్లావ్యాప్తంగా వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాల వద్ద భక్తులు బారులుతీరి శివనామస్మరణలు చేశారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు, అలంకారాలు జరిగాయి. సాయంత్రం విశేష పుష్పాలంకరణలు, కార్తీక దీపారాధనలు స్వామివార్లకు ఆలయ ప్రాకారోత్సవాలు కనుల పండువగా జరిగాయి. భక్తులతో ఆలయాలు కళకళలాడాయి. మొంథా తుపాను కారణంగా రామాయపట్నం, తుమ్మలపెంట, ఇస్కపల్లి, రామతీర్థం, మైపాడు, కోడూరు, తదితర బీచ్‌లో కార్తీక స్నానాలకు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. జిల్లా యంత్రాంగం బీచ్‌ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.







సీతారామపురం : భైరవకోనలో క్యూలైన్‌లో భక్తులు





మనుబోలులో పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు

ఏటీఎస్ సెంటర్ రద్దు చేయాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఆటో కార్మికులు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు నష్టం కలిగించే ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టం (ఏటీఎస్) సెంటర్ రద్దు చేయాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్‌సీ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, నగర కార్యదర్శులు టీవీవీ.ప్రసాద్, నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడారు. ముత్తుకూరు మండలం కప్పదొరువు వద్ద నిర్మించిన ఏటీఎస్ సెంటర్ వల్ల వాహనదారులు ఫిట్నెస్ సర్టిఫికెట్‌లు, డ్రైవింగ్ లైసెన్సులు కావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అంతేకాకుండా వీటిని ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన కారణంగా అవకతవకలు జరుగుతున్నాయన్నారు. గతంలో జిల్లావ్యాప్తంగా రెవెన్యూ డివిజన్‌ల వారీగా ఆర్టీఏ అధికారులే ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చేవారని తెలిపారు. ప్రస్తుతం జిల్లా అంతటా ఒకే సెంటర్ పెట్టిన కారణంగా వాహనాల రిజిస్ట్రేషన్ కోసం దాదాపు వారం రోజులు వేచి ఉండాల్సిన దుస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆర్టీఏ అధికారుల ద్వారానే ఈ సర్టిఫికెట్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లేదంటే ఏటీఎస్ సెంటర్ వద్ద 48 గంటల ధర్నాకు సైతం పిలుపు నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు సురేష్, నేతలు బాబూరావు, రవీంద్ర, పెంచలయ్య, శ్యాంసన్, ప్రేమనివాస్, సురేష్, జకీర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

● కేవీకే కోఆర్డినేటర్ లలితాశివజ్యోతి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో మంగళవారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ జీ.లలితాశివజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉండడంతో పక్వం దశలో ఉన్న కూరగాయలు, ఉద్యాన పంటలను తక్షణమే కోయాలని పేర్కొన్నారు. అరటి తోటల్లో మొక్కలకు సరైన ఊతం ఉండేలా చూసుకోవాలని తెలిపారు. పిడుగుల నుంచి రక్షణ కల్పించేలా పశువులు, మేకలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సక్రమంగా మేత అందేలా చూడాలని పేర్కొన్నారు. సజ్జ పంట కోసి పొలాల్లో ఉంచినప్పుడు 2శాతం ఉప్పు ద్రావణం లీటరు నీటికి 20గ్రాములు పిచికారి చేయడం వల్ల బూజు పట్టదని, గింజలు మొలకెత్తకుండా నివారించవచ్చని తెలిపారు. కంది పంట పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు తీసేయాలని, 1శాతం 19:19:19 లేదంటే పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని తెలిపారు. వర్షం ఆగిన తరువాత మారుకా కాయ తొలుచు పురుగు నివారణకు క్లోరిఫైరిఫాస్ 2.5మి.లీ లేదా నోవాల్యూరాన్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు. మినుము, పెసర పంట పొలాల్లో నిలిచిన నీటిని తొలగించి ఇనుము లోపాన్ని సరిచేసేందుకు లీటరు నీటికి ఫెర్రస్ సల్ఫేట్ 5గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5గ్రాములు, యూరియా 20గ్రాములు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వేరుకుళ్లు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు హెక్సాకోనజోల్ 2మి.లీ లేదా ప్రొపికొనజోల్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వర్షాలు ఆగాక నారుమడి వేయాలన్నారు.

కన్నీరొలికిన గోళ్లవారిపల్లె



మృతదేహాల వద్ద బోరున విలపిస్తున్న బంధువులు



అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో అసువులుబాసిన గోళ్ల రమేష్ కుటుంబ సభ్యులకు సోమవారం వారి స్వగ్రామం గోళ్లవారిపల్లెలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. బంధువులు, గ్రామస్థులు, స్నేహితులు తరలిరావడంతో గ్రామంలో దుఃఖసాగరంలో మునిగిపోయింది. కర్నూలులోని జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం గోళ్ల రమేష్, అనూష, వీరి బిడ్డలు శశాంత్, మన్విత మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్‌లో ఆదివారం రాత్రి స్వగ్రామానికి చేర్చారు. సోమవారం భారీ జనసందోహంతో అంతిమయాత్ర నిర్వహించి దహనసంస్కారాలు చేశారు. గ్రామంలో ఒకే సామాజికవర్గం ఉండడం అందులో అందరూ బంధువులు కావడంతో గ్రామమంతా మూగబోయింది. గ్రామంలో అత్యధిక శాతం మంది యువకులు వ్యాపారం, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లి వారి జీవనోపాధి చేసుకుంటూ ఉంటారు. అలాంటి వారంతా ఈ ఘటన తెలిసిన వెంటనే స్వగ్రామానికి తరలివచ్చారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో లక్కీడ్రా

● విజేతకు సిల్వర్ కాయిన్ అందజేత

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌లో దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18 నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ హెల్త్ కేర్ నుంచి రీచార్జ్ చేసుకున్న కస్టమర్లకు లక్కీ డ్రా ద్వారా 10 గ్రాముల సిల్వర్ కాయిన్ అందచేస్తామని ప్రకటించినట్లు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆ మేరకు రీచార్జ్ చేసుకున్న కస్టమర్ల నుంచి సోమవారం లక్కీ డ్రా తీశారు. ఈ లక్కీడిప్‌లో నెల్లూరు నగరంలోని లేక్‌వ్యూ కాలనీకి చెందిన ఎన్.నాగేంద్ర విజేతగా నిలిచారు. ఆయనకు డిప్యూటీ జనరల్ మేనేజర్ వెండి కాయన్ అందజేసి అభినందించారు. వినియోగదారులందరూ బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్‌లకు సెల్ఫ్‌కేర్ యాప్ ద్వారా రీచార్జ్ చేసుకుని విలువైన బహుమతులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ రాంమోహన్‌రావు, సుచిత్ర, వరప్రసాద్, బేబీ, పీసీ.రాణి, తదితరులు పాల్గొన్నారు.



బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో లక్కీ డ్రా విజేతను అభినందిస్తున్న డీజీఎం శ్రీనివాసరావు

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఒకరు డీబార్

వెంకటాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో సోమవారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల్లో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు మొత్తం 15,361 మంది విద్యార్థులకుగాను 14,282 మంది హాజరయ్యారు. 1079 మంది గైర్హాజరయ్యారు. కాగా గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని డీబార్ చేసినట్లు తెలిపారు.

ఈఈఎంటీ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ అనుమతితో ఎడ్యుకేషన్ ఏపీ ఫణి అనే సంస్థ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈఈఎంటీ మెరిట్ పరీక్షకు నవంబరు 14వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ ఈవో ఎస్‌వీ. నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. పరీక్షను ప్రిలిమ్స్, మెయిన్స్ రెండు దశల్లో నిర్వహిస్తారని, ప్రిలిమ్స్‌ను ఇంటి నుంచి లేదా పాఠశాలలో ఆన్‌లైన్‌లో రాయాలని, మెయిన్స్ పరీక్ష ఎంపిక చేసిన కేంద్రాల్లో రాయాలని పేర్కొన్నారు. టెన్త్ విభాగంలో రాష్ట్రస్థాయిలో తొలి 3 స్థానాల్లో ఉన్న వారికి రూ.30వేల, రూ.25వేల, రూ.20వేల, జిల్లాస్థాయిలో రూ.8వేల, రూ.6వేల, రూ.4వేల, 7వ తరగతిలో రాష్ట్రస్థాయి విజేతలకు రూ.20వేల, రూ.15వేల, రూ.10వేల, జిల్లాస్థాయిలో రూ.5వేల, రూ.4వేల, రూ.3వేల అందిస్తారని పేర్కొన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

డీఆర్వోగా విజయకుమార్

● రామాయపట్నం క్లస్టర్‌కు నలుగురు డిప్యూటీ కలెక్టర్లు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



డీఆర్వో విజయకుమార్

నెల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా ఎన్ విజయకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన జిల్లా పౌరసరఫరాల శాఖాధికారిగా పని చేస్తున్నారు. అలానే ఇన్‌చార్జ్ డీఆర్వోగా కూడా వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన రేషన్ అక్రమ రవాణా వ్యవహారాల్లో పౌరసరఫరాల శాఖ డీఎస్‌వో వియజకుమార్‌ను సరెండర్ చేసింది. ఇప్పుడు ఆ అధికారిని రెగ్యులర్ డీఆర్వోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న బీఎస్ నారాయణరెడ్డిని టీజీపీ భూసేకరణ విభాగం రాపూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. కాగా రామాయపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ క్లస్టర్‌లో ఇండోసోల్‌తోపాటు ఇతర పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకుగానూ తాజాగా నలుగురు డిప్యూటీ కలెక్టర్లను నియమించింది. విజయవాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న జీవీవీ సత్యనారాయణ, ఏపీమారిటైం బోర్డులో పనిచేస్తున్న ఆర్ శివారావు, పోలవరం ప్రాజెక్టులో పనిచేస్తున్న కోమటినేని నరసయ్య, బాపట్ల ఎస్ఎస్‌ఏ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఎం నాగిరెడ్డిలను రామాయపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు.. 3 నెలలు పొడిగింపు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎల్‌ఆర్‌ఎస్‌ను మరో మూడు నెలలపాటు పొడిగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన జీవో ఈ నెల 23వ తేదీకి ముగియడంతో తాజాగా 2026, జనవరి 23వ తేదీ వరకు రెగ్యులరైజ్ చేసుకోవచ్చని తాజా ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

31 నుంచి వేదగిరి పవిత్రోత్సవాలు

నెల్లూరురూరల్,అక్టోబరు 27,(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రం వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 31వ తేదీ నుంచి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ అచ్యుత శంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలోని తన కార్యాలయంలో మాట్లాడారు. నవంబరు 3వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు అధికార, అర్చక బృందం సిద్ధమైనట్లు తెలిపారు. 31న భగవత్ప్రార్థన, 1వ తేదీన అగ్ని ప్రతిష్ఠ, 2న కుంభారాధన, గిరిప్రదక్షిణ, 3న ఉక్త, సర్వగాయత్రీహోమం, అక్షతారోపణతో ఉత్సవాలు ముగిస్తాయని పేర్కొన్నారు.

గుర్రపు డెక్కలు.. ప్రమాద ఘంటికలు!

● మెష్‌ల ఏర్పాటుతో ఆందోళనలో గ్రామస్థులు



మెష్‌కు ఆనిన గుర్రపు డెక్క

అల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తీవ్ర తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అల్లూరు చెరువు, రామన్న చెరువుల వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. మాత్రం ప్రమాధభరితంగా మారాయి. నిండు కుండల్లా చెరువుల్లో నీరు చేరడంతో స్థానికులు భయాందోళనలకు లోనవుతున్నారు.

● నీటి సరఫరాకు అంతరాయం

చెరువుల్లో, కాలువల్లో గుర్రపుడెక్క నిండిపోయి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్య అల్లూరు చెరువు, రామన్న చెరువుల్లో అధికంగా ఉంది. పైడేరు ఎస్కేప్ - 2 ఛానల్ ద్వారా వచ్చే నీటిని ఏటీఎస్ (అల్లూరు ట్యాంక్ సప్లై ఛానల్) ద్వారా అల్లూరు చెరువుకు, అక్కడి నుండి రామన్న చెరువుకు తరలించేవిధంగా ఏర్పాటు చేశారు. కానీ ఏటీఎస్ ఛానల్ ద్వారా అల్లూరు చెరువుకు వచ్చే నీటితోపాటు గుర్రపు డెక్క చెరువుల్లో చేరుతోంది.

● మెష్‌లతో పొంచి ఉన్నప్రమాదం

చెరువులకు నీటిని సరఫరా చేసే ప్రధాన కాలువలు, చెరువులు నిండితే నీటిని బయటికి పంపే కలుజుల్లోకి చేపలు వెళ్లకుండా మెష్‌లను ఏర్పాటు చేశారు. ఫలితంగా గుర్రపుడెక్క వీటికి అడ్డుపడి నీరు సులభంగా బయటికి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో సమస్య జఠిలమయ్యే పరిస్థితి ఉందని స్థానికులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలతో ప్రమాదం పొంచి ఉన్న తరుణంలో ఈ విధంగా మెష్‌లను ఏర్పాటు చేయడం సరికాదని, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఇలా మెష్‌లను ఏర్పాటు చేయడం ఏమిటని రైతులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక వాయిదా

నెల్లూరు (విద్య), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సివిల్ సర్వీసు ఉద్యోగుల 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన క్రీడా జట్ల ఎంపికను ఈనెల 29వ తేదీన నిర్వహించాల్సి ఉండగా భారీ వర్షాల కారణంగా తాత్కాలికంగా వాయిదా వేసినట్లు డీఎస్‌డీవో ఆర్‌కే.యతిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు ముగిసిన తరువాత తేదీలను తిరిగి ప్రకటిస్తారని, ఉద్యోగులు దీనిని గుర్తించాలని పేర్కొన్నారు.

ఐఈఆర్‌పీల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మండల భవిత కేంద్రాల్లో విజువల్ ఇంపైర్, హియరింగ్ ఇంపైర్ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 43 మంది ఐఈఆర్‌పీల ఒరిజినల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం పరిశీలించారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో త్రిసభ్య కమిటీ సర్టిఫికెట్లను పరిశీలించి నిర్ధారణ చేశారు. మంగళవారం ఎంఆర్ విభాగంలో పనిచేసే ఐఈఆర్‌పీల సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతామని, ప్రతి ఒక్కరూ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో డిప్యూటీ ఈవో వెంకటేశ్వరనాయక్, టీపీగూడూరు ఎంఈవో జయరామ్‌నాయుడు, టీపీగూడూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రియాజ్‌అహ్మద్, ఎస్ఎస్ఏ సహిత విద్యా కోఆర్డినేటర్ పీ.ప్రసాద్‌రావు, ఎస్ఎస్ఏ తిరుపతి సహిత విద్యకోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం నకిలీనా.. కాదా!?

● అందుబాటులోకి ఏపీ సురక్ష ఎక్సైజ్ యాప్



నెల్లూరు(క్రైం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల్లో కొనుగోలు చేస్తున్న మందు నకిలీనా.. కాదా!? తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ సురక్ష ఎక్సైజ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిపై మద్యంప్రియులతో పాటు షాపులు, బార్ల యజమానులకు ఎక్సైజ్ అవగాహన కల్పిస్తున్నారు. స్మార్ట్ ఫోన్లలో గూగుల్‌లోకి వెళ్లి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ అని టైప్ చేసి క్లిక్ చేసిన వెంటనే గూగుల్ పే సురక్ష యాప్ కనిపిస్తుంది. ఆ తర్వాత ఇన్‌స్టాల్ బటన్ క్లిక్ చేస్తే యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. యాప్‌ను ఓపెన్ చేసిన వెంటనే కన్జూమర్, రిటైలర్ అని రెండు ఆప్షన్స్ ఉంటాయి. కన్జూమర్ ఆప్షన్ ఎంపిక చేసిన వెంటనే లొకేషన్, కెమెరాలకు అనుమతులు అడుగుతుంది. వాటిని ఓకే చేసిన వెంటనే కన్జూమర్ పోర్టల్ పేజీ ఓపెన్ అయి స్కాన్ క్యూఆర్ కోడ్ ఆప్షన్‌లో కెమెరా సింబల్ కనిపిస్తుంది. కెమెరాపై క్లిక్ చేసి మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, కిందనే ఉన్న సెక్యూరిటీ కోడ్‌ను ఎంటర్ చేసి వెరిఫై ప్రొడెక్ట్‌ను క్లిక్ చేస్తే మద్యం నకిలీది అయితే ఎర్రర్ అంటు రెడ్ అని చెబుతోంది. నకిలీది కాకపోతే గ్రీన్ సిగ్నల్ వస్తుంది. దీంతోపాటు ఆ మద్యం ఎక్కడ తయారైంది.. ఎప్పుడు తయారు చేశారు.. ఇలా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా లిక్కర్ బాటిళ్ల మాత్రమే స్కాన్ చేసుకునే అవకాశం ఉంటుంది. బీర్లకు వర్తించదు. నకిలీ మద్యం అని తేలితే 14405 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే అధికారులు విచారిస్తారు.

● ప్రజలకు అవగాహన కల్పిస్తూ...

ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఎక్సైజ్ శాఖ ఈ నెల 16వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు జిల్లాలోని బార్లు, వైన్‌షాపుల యజమానులు, సిబ్బందికి యాప్‌పై అవగాహన కల్పించారు. బార్లు, మద్యం దుకాణాల్లో విక్రయించి ప్రతి మద్యం బాటిల్‌ను యాప్‌లో స్కాన్ చేయాలని అధికారులు ఆదేశించారు. అంతేగాక మందుబాబుల్లో అవగాహన కల్పించేందుకు వైన్‌షాపులు, బార్ల వద్ద సురక్ష యాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. కరపత్రాలను ముద్రించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

దివ్యాంగుల శాఖ ఏడీపై చర్యలకు ఆదేశం

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 27,(ఆంధ్రజ్యోతి): జిల్లా దివ్యాంగులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాని కోరుతూ ఆశాఖ డైరెక్టర్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని దివ్యాంగ బాలికల పాఠశాలలో ఉండాల్సిన జూనియర్ సహాయకుడు, వాచ్ ఉమన్‌లను దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ తన కార్యాలయంలో పనిచేయడానికి వినియోగిస్తున్నాడని నవ్యాంధ్ర వికలాంగ హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే కాలేషా ఆరోపించారు. అంతేకాకుండా ఆ పాఠశాలలో దివ్యాంగుల బాగోగులు చూసేందుకు ఆ ఉద్యోగులు ఉండాలని, ఆ పాఠశాలలో సీసీ కెమరాలు లేవని, దివ్యాంగ బాలికల రక్షణ కరువైందని డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపి ఏడీపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆదేశాలు ఇచ్చారు.

సోమశిల సందర్శనకు రావొద్దు : ఎస్‌ఐ

అనంతసాగరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులు, సందర్శకులు సోమశిలకు రావద్దని ఇన్‌చార్జి ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి సోమవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొంథా తుపాన్ కారణంగా సోమశిల సందర్శనకు అనుమతి లేదని, ఈనెల 30వ తేదీ వరకు రావద్దని సూచించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11733
వెండి కిలో ధర	రూ. 153100
వెండి ఒక గ్రాము	రూ. 159.10

న్యూస్ బాక్స్

పునరావాస కేంద్రం పరిశీలన



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు హేమంత్‌కుమార్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సోమవారం తహసీల్దారు హేమంత్‌కుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు తాగునీరు, నిత్యావసర వస్తువులతో పాటు వ్యాధుల నివారణకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ప్రజలకు ప్రాణ, ఆస్తినష్టాలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఆదినారాయణ, మనోహర్, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర,య సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలి

ఉదయగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెట్టప్రాంతాల సాగు, తాగునీటి కష్టాలు తీర్చే వెలుగొండతో పాటు అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్లను పూర్తిచేయకపోవడం దారుణమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై జనవరి నుంచి సీపీఎం ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, కామాక్షమ్మ, గడ్డం నాగేశ్వరరావు, పందిళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ఉదయగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి సమీపంలో గృహనిర్మాణ శాఖ లేఅవుట్‌లో కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను వారంలోపు పూర్తి చేయాలని ఎంపీడీవో బీ శ్రీనివాసులు కాంట్రాక్టర్ తమ్మిశెట్టి వెంకటేష్‌కు సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ గృహనిర్మాణ పనులు దక్కించుకుని నెలలు గడుస్తున్నా వాటిని నిర్మించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారంలోపు నిర్మాణాలు ప్రారంభించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు ప్రారంభించని పక్షంలో కాంట్రాక్టర్‌కు కేటాయించిన రూ.58,20,200 చెల్లించాలన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్‌కు నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఏ పీరాన్, ఏఈ షరీఫ్, వర్క్ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు రూటర్స్ పంపిణీ

ఉదయగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో టీ వెంకటేశ్వర్లు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు రూటర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపండి : సీఐ



జాతీయ రహదారిపై డ్రైవర్ చేత ముఖం శుభ్రం చేయిస్తున్న పోలీసులు

ఉదయగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతో వాహనాలు నడిపి ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఉదయగిరి సీఐ ఎస్ వెంకటరావు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సోమవారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి స్టాప్- ఫేస్‌వాష్ - గో కార్యక్రమం 565, 167-బీజీ జాతీయ రహదారులపై చేపట్టారు. వాహనాలు నిలిపి డ్రైవర్లను కిందకు దింపి ముఖం శుభ్రం చేయించి వాహనాలను పంపారు. డ్రైవర్లపై ఎందరో జీవితాలు ఆధారపడి ఉంటాయని, డ్రైవింగ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఐలు ఇంద్రసేనారెడ్డి, శ్రీను, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

అత్మకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి, కన్యకా పరమేశ్వరి ఆలయం, అలమునాథస్వామి ఆలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు.

●**సంగం:** మండలంలోని శివాలయాల్లో కార్తీక సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అదే విధంగా తిరుమనకొండలోని రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో, వంగల్లులోని భీమేశ్వరాలయం, దువ్వూరులోని కోటేశ్వరాలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

●**ఉదయగిరి:** మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయంతోపాటు మండలంలోని గండిపాళెం, అప్పసముద్రం, గుడినరవ, లింగాలదొన క్షేత్రం, యర్రబల్లిగడ్డ, ఆర్లపడియ గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు భారీగా చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీకదీపాలు వెలిగించారు. అర్చకులు స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆత్మకూరు శివాలయంలో ప్రత్యేక అలంకరణలో విశ్వేశ్వరుడు

●**సీతారామపురం:** మండలంలోని భైరవకోన, ఘటిక సిద్ధేశ్వరం, సీతారామపురంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని శివనామస్మరణ చేస్తూ శివయ్యకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి.



సంగంలోని సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

●**అనంతసాగరం:** సోమశిల జలాశయం వద్ద ఉన్న సోమేశ్వరుని ఆలయంలో కార్తీక సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తుపాన్ కారణంగా భక్తుల రద్దీ తగ్గింది. వచ్చిన వారు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలింగించి మొక్కులు తీర్చుకున్నారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : ఆర్డీవో

ఆత్మకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు చేట్టామని ఆర్డీవో బి పావని తెలిపారు. సోమవారం ఆమె రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులతో కలిసి మండలంలోని పెన్నానది పరీవాహక గ్రామమైన బండారుపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. రేషన్‌షాపును సందర్శించి ప్రజలకు బియ్యం, ఇతర సరుకులు అందుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను యుద్ధ ప్రాతిపదికన పునరావాస కేంద్రాలకు తరలించేందుకు తగు ఏర్పాట్లు చేశామన్నారు. ఏదేని ప్రాణ, ఆస్తి, పంట నష్టం సంభవించినా, ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 9100948215 నెంబరుకు ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమెవెంట తహసీల్దారు బి పద్మజా కుమారి, ఎస్‌ఐ షేక్ జిలాని, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పునరావస కేంద్రాలకు చేరుకోవాలి

ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను, వెంకట్రావుపల్లి, నెల్లూరుపాళెం తదితర ఎస్టీ కాలనీలను సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ పరిశీలించారు. ఇబ్బందికర పరిస్థితుల్లో పునరావాస కేంద్రాలకు తరలిరావాలని ఆయన ఆయా ప్రాంతాల ప్రజలకు సూచించారు.

ప్రజలకు సురక్షిత నీరు అందించాలి

ఉదయగిరి : మొంథా తుఫాన్ పట్ల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఎల్ రామ్మోహన్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంచేసి ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముంపునకు గురయ్యే గ్రామాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రాకపోకలు స్తంభించే వాగు ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటలు దెబ్బతినకుండా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, డీటీ షాజియా, వైద్యాధికారిణి శివకల్పన, ఎంఈవో-1 వెంకటేశ్వర్లు, ఏవో విజయభాస్కర్, విద్యుత్ ఏఈ చెంగయ్య, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా పాల్గొన్నారు.



ఉదయగిరి: సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దారు రామ్మోహన్

తుఫాన్ తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలి

●**అనంతసాగరం :** మొంథా తుఫాన్ ప్రభావం తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు జయవర్ధన్ సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వాగులు, వంకలు, నదుల వద్దకు ప్రజలు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బీరాపేరులో గుర్రపుడెక్క తొలగింపు



బీరాపేరు వాగులో గుర్రపు డెక్క తొలగిస్తున్నసిబ్బంది

సంగం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు సోమవారం బీరాపేరు వాగులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క తొలగించారు. ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు సంగం వచ్చిన ఆనం రామనారాయణరెడ్డికి బీరాపేరు వాగులో గుర్రపుడెక్క వల్ల వరద నీరు పారక పెరమన రహదారి బ్రిడ్జి మీద ప్రవహిస్తున్నాయని గ్రామస్థులు మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన వెంటనే గుర్రపు డెక్క తొలగించాలని ఆర్డీవోను ఆదేశించారు. ఆమేరకు ఆమె బీరాపేరు వాగును పరిశీలించి ఇరిగేషన్ అధికారులచే గుర్రపు డెక్క ఆకు తొలగింపచేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కాలువల్లో పూడికతీత

●**ఉదయగిరి రూరల్ :** మొంథా తుపాను ప్రభావంతో ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ సోమవారం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కొండ ప్రాంతానికి సమీపంలోని ఎస్సీ కాలనీలో కాలువల్లో పూడిక తీయించారు. గండిపాళెం పశువైద్యశాల సమీపంలోని విద్యుత్ స్తంభాలకు కంపచెట్లు అల్లుకుపోవడంతో ఎక్స్‌కవేటర్‌తో తొలగించి కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయించారు.

చెరువుల పరిశీలన

●**సీతారామపురం:** మండలంలోని స్వామిచెరువు, ఊరచెరువు, మరువూట్ల రిజర్వాయర్‌లను తహసీల్దార్ ఫజిహా, ఇరిగేషన్ ఏఈ సురేష్ సోమవారం పరిశీలించారు. ముంపు ప్రాంతవాసులను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టామన్నారు. ఎక్కడైనా చెరువుల లీకేజీలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సుభాని, వీఆర్వోలు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంక్‌ల పరిశీలన

●**కలువాయి :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని తాగునీటి ట్యాంక్‌లు, వాటికి నీటిని అందించే వనరులను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు సోమవారం పరిశీలించారు. మండల కేంద్రమైన కలువాయి, నూకనపల్లి, పెన్నబద్వేలి తదితర గ్రామాల్లో అధికారులు పర్యటించి వాటిని పరిశీలించారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ ప్రభుత్వ వైద్యశాలలో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని యుపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అస్మా తెలి పారు. సోమవారం ఆమె వైద్య సిబ్బందితో సమావేశమై ఏఎన్ఎం, ఆశాలకు తగు సూచనలు చేశారు. మున్సిపాల్టీ పరిధిలో ఉన్న గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈనెల 30వ తేదీలోపు కాన్పు అయ్యే గర్భిణులను ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తీసుకెళ్లాలని, చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సిద్దం సుధాకర్, ఎంపీ హెచ్‌ఏలు రవీంద్రరెడ్డి, పోలిరెడ్డి, రసూల్, పాల్గొన్నారు.

రైతుబజార్ ద్వారా కూరగాయలు విక్రయం



డీసీపల్లిలో రైతుబజార్ ద్వారా కూరగాయలు కొనుగోలు చేస్తున్న గ్రామస్థులు

మర్రిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్ ద్వారా ప్రజలకు తక్కువ ధరలతో కూరగాయలు విక్రయిస్తున్నట్లు ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో మొంథా తుఫాన్ దృష్ట్యా ఆత్మకూరు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుండి బుధవారం వరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు తక్కువ ధరకు కూరగాయలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు ప్రత్యేక వాహనాలతో గ్రామాలకు కూరగాయలను తెప్పిస్తున్నట్లు తెలిపారు. సోమవారం మర్రిపాడు మండలం డీసీపల్లిలో కూరగాయలు విక్రయిస్తున్న రైతుబజార్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట సెక్రటరీ కృష్ణప్రసాద్, సూపర్‌వైజర్ మహేష్‌బాబు ఉన్నారు.

తుఫాన్ తగ్గే వరకు నారుమళ్లు వేయొద్దు

సంగం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ముంథా తుఫాన్ ప్రభావం తగ్గే వరకు మండలంలో రైతులెవరూ నారుమళ్లు వేయొద్దని వ్యవసాయాధికారి శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే బీపీటీ నారుమళ్లు నవంబరు 5వ తేదీ లోపు వేయాలన్నారు. కెఎన్ఎం 733, కెఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 రకం విత్తనాలు నవంబరు 15 నుంచి డిసెంబరు 15వ తేదీ లోపు నారుమళ్లు వేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ముందుగా నారుమళ్లు వేస్తే ముందుగా వెన్ను వచ్చి దిగుబడి తగ్గే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం : జోనల్ చైర్మన్



కార్మికులకు రెయిన్‌కోట్, యూనిఫాం అందజేస్తున్న సురేష్‌రెడ్డి

ఉదయగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ధ్యేయమని, నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గ్యారేజీ, బస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు బీజేపీ నాయకులు ముడమాల రమేష్‌రెడ్డి సమకూర్చిన రెయిన్ కోట్లు, యూనిఫాంలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూల్‌లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం బాధాకరమన్నారు. అలాంటి సంఘటనలు ఆర్టీసీలో జరగవన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ కలిగిన సంస్థ ఆర్టీసీ అన్నారు. త్వరలో ఆర్టీసీ ద్వారా ప్రభుత్వం 1,500 బస్సులు కొనుగోలు చేయనుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం 1,350 ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు కొనుగోలుకు అవసరమైన సబ్సిడీని సైతం అందజేసిందన్నారు. వీటితోపాటు మరో 3వేల మంది సిబ్బంది అవసరమని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రమేష్‌కుమార్, సీఐ నాగభూషణం, బీజేపీ నేతలు కదిరి రంగారావు, మేకపాటి మాల్యాద్రినాయుడు, నెల్లూరు వెంకటస్వామి, ట్రాఫిక్, కార్యాలయ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్‌లో సౌకర్యాలు కల్పిస్తాం

సీతారామపురం: స్థానిక మండల కార్యాలయాల ఎదురుగా ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికుల కోసం తాగునీరు, మరుగుదొడ్లు తదితర అన్ని సౌకర్యాలు కల్పించి, బస్‌స్టేషన్‌ను వినియోగంలోకి తెస్తామని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం సురక్షిత మన్నారు. కడప, ప్రకాశం జిల్లాల సరిహద్దు మండలమైన ఈ ప్రాంతం నుంచి సి.ఎస్. పురం, పోరుమామిళ్లకు అదనపు బస్సుల సౌకర్యం కలిగించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్, బిజెపి నాయకులు మేకపాటి మాల్యాద్రి నాయుడు, గెట్టిబోయిన వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి, తోట ఏడుకొండలు, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



రామ్‌చరణ్ మృతదేహం

మర్రిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి విద్యార్థి మృతిచెందిన సంఘటన సోమవారం మర్రిపాడు మండలం రామా నాయుడు పల్లిలో చోటుచేసుకుంది. గ్రామంలో జయరాములు, భాగ్యమ్మల కుమారుడు కోనంకి రామ్‌చరణ్ (13) 8వ తరగతి చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి బొగ్గేరులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేశారు.

బైకును ఢీకొన్న కారు

● ముగ్గురికి గాయాలు



గాయపడ్డ పెంచలయ్య

రాపూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న కారు ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన సంఘటన మండల పరిధిలోని తూమాయి సబ్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తూమాయిలో తోటలో పని ముగించుకుని స్వగ్రామమైన సిద్దవరానికి ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పామూరు నుంచి శ్రీకాళహస్తి దేవాలయానికి వెళుతున్న కారు తూమాయి సబ్ స్టేషన్ సమీపంలో వేగంగా వచ్చి బైకును ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలో ఉన్న పెంచలయ్య (55)కు తీవ్ర గాయాలు కాగా, వెనకాల కూర్చున్న పెంచలయ్య మనవడు లోకేష్ (11), అతని స్నేహితుడు చందు (16)కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రు లను మొదట 108లో రాపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకు బోల్తా పడి...

వెంకటాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసుమూరు పంచాయతీ పరిధిలోని చింతలపాళెం - వడ్డీపాళెం గ్రామాల మధ్య సోమవారం మోటారు బైకు బోల్తాపడి ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని పద్మావతి సెంటర్ ప్రాంతానికి చెందిన మున్నా, ఇలియాజ్ దైవదర్శనం కోసం కసుమూరు దర్గాకు వెళ్లారు. అక్కడినుండి తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా చింతలపాళెం దాటిన తర్వాత వడ్డీపాళెం సమీపంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్డుపై గుంతలు ఉండడంతో అదుపు తప్పి బైకు బోల్తాపడింది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆటోలో కసుమూరులోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పొలంలోని నీటిలో ఉన్న కారు

జలదంకి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం జమ్మలపాలెం వద్ద కావలి మిల్క్‌లైన్స్ సమీపంలో 167 జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసు కెళ్ళింది. ఈ ప్రమాదంలో కారుకి గానీ అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. కారు పొలాల్లోకి దూసుకెళ్ళిన విదానం చూసి రహదారిపై ప్రయాణిస్తున్న వారు గుంపులుగా చేరి చర్చించుకోవడం ఆ ప్రాంతంలో కనిపించింది. ఈ సమయంలో కారుకు సంభందించిన వారు ఎవరూ ఆ ప్రాంతంలో లేకుండా వెళ్ళిపోయారు.

అదృశ్యమైన విద్యార్థులు తల్లిదండ్రుల చెంతకు...

నెల్లూరురూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ఇటీవల అదృశ్యమైన ఇద్దరు పదవ తరగతి విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు రూరల్ సీఐ గుంజి వేణు సోమవారం తెలిపారు. ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య స్కూల్ హాస్టల్‌లో ఉండి పదో తరగతి చదువుతున్న లోకేష్, రాకేష్‌లు ఇటీవల అదృశ్యమయ్యారని, హాస్టల్ ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో వారు హాస్టల్ నుంచి తిరుపతికి వెళ్లి అక్కడి నుంచి గూడూరుకు వచ్చి రైల్వే స్టేషన్‌లో ఉండగా అక్కడి పోలీసులు గుర్తించి తమకు సమాచారం అందచేశారని చెప్పారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

వెంకారెడ్డి మృతదేహం గుర్తింపు

● వెలికితీసిన గజ ఈతగాళ్లు

బిట్రగుంట, అక్టో బరు 27 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మం డలం ముంగ మూరు లో మూడు రోజుల క్రితం కనిపించకుం డాపోయిన కేతిరెడ్డి వెంకారెడ్డి (75) మృత దేహం సోమవారం లభ్యమైంది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. శనివారం ఉదయం వెంకారెడ్డి బహిర్భూమికని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన కుమారుడు కేతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పోలీసులకు ఫి ర్యాదు చేశాడు. ఎస్‌ఐ ఎన్ ప్రభాకర్, సిబ్బంది పలుచోట్ల వెతికారు. ఆదివారం గజ ఈతగాళ్లు గాలించగా సోమవారం ఉదయం వెంకా రెడ్డి మృతదేహం లభ్యమైయిందని పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తర లించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

విడవలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొనడంతో ఓ ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఊటుకూరు కంచరపాళెం సమీపంలో సోమవారం జరిగింది. ఊటుకూరు నుంచి రామతీర్థం గ్రామానికి మోటారు వాహనంపై వస్తున్న కాటంగారి శివాజీని గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో శివాజీ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు 108కి ఫోన్ చేసినా రావటానికి ఆలస్యం కావటంతో, స్థానిక టీడీపీ, మత్స్యకార నాయకుడు ఆవుల వాసు తన కారులో క్షతగాత్రుడిని నెల్లూరులోని ఆసుపత్రిలో చేర్పించారు. దీంతో ఆవుల వాసుని స్థానికులు అభినందించారు.

వీఎస్‌యూలో ఇంటర్వ్యూలు 30కి వాయిదా

వెంకటాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని కావలి పీజీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో ఉద్యోగాల భర్తీకి జరగాల్సిన ఇంటర్వ్యూలు ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ కే సునీత ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూల ద్వారా ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నాన్ టీచింగ్ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీన వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని సూచించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 560

సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

బిట్రగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో మొంథా తుఫాను ప్రభావం వల్ల తూర్పు తీరప్రాంత సముద్రంలో సోమవారం అలలు ఎగసిపడుతున్నాయి. తెల్లవారుజామునుంచి గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు తీర ప్రాంతప్రజలను అప్రమత్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, గుంటలు దాదాపు నిండుకుండల్లా ఉన్నాయి.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు పతకాలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన 38వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్-50 పురు షుల విభాగం లో ఏ.శ్రీనివాసులు బంగారుపతకం, అండర్-24 మహిళల విభాగంలో ఎస్.లీనా రజితపత కం, అండర్-14 బాలుర విభాగంలో ఎస్.సాధన బంగారుపతకం సాధించారు. పతకాలు సా ధించిన క్రీడాకారులు బాపట్లలో డిసెంబర్ 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే జాతీయ పోటీ లకు ఎంపికయ్యారని జిల్లా యోగా క్రీడా అసోసి యేషన్ కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు.

బీసీల పట్ల వివక్ష తగదు

కావలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో 52 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీల పట్ల రాజకీయపార్టీలు వివక్ష చూపుతున్నాయని బీసీ ఐక్యతభవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్‌రావు తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రభాకర్‌రావుతో పాటు ఆ భవన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయుడు పరి శుద్ధరావు, గౌరవాధ్యక్షుడు ఉరిటి గోవింద్, సహాయ కార్యదర్శి కోడింగారి శ్రీను, వ్యవ స్థాపక అధ్యక్షుడు చిన్ని వర ప్రసాద్‌రావు మాట్లాడారు. బీసీ ఐక్యతభవన్ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం కావలిలో జరుగుతుందన్నారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, కులగణన, రాజకీయాలలో బీసీల వాటా తదితర అంశాలపై చర్చిస్తామని ఆయన తెలిపారు.

తాగునీరివ్వాలని వినతి

కావలి (టౌన్) అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడమగుంట గిరిజన కాలనీకి తాగునీరు సరఫరా చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం డీఏవోకు విన తిపత్రం అందించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ బుడమగుంట 17వ వార్డు గిరిజన కాలనీలో సుమారు వందకు పైగా గిరిజన కుటుంబాలు పదేళ్లుగా నివాసం ఉంటున్నా మున్సిపల్ అధికారులు తాగునీరు సరఫరా చేయడం లేదన్నారు. రెండు రోజులకోసారి ట్యాం కర్ల ద్వారా సరఫరా చేసే నీరు తాగేందుకు పనికి రావని, పాలకులు వెంటనే నీటిసరఫరా చేయించి ఎన్నికల హామీని నిలబెట్టుకో వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, సీఐ టీయూ పట్టణాధ్య క్షుడు తిరుపాలు, స్థానిక గిరిజన సంఘం పెద్దలు లక్ష్మయ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.

రాయితీ వరి విత్తనాల సరఫరా ఎప్పుడు?

జలదంకి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రబీ వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నా నేటికీ వ్యవసాయశాఖ రాయితీ వరి విత్తనాలు సరఫరా చేయలేదు. ఈనెల చివరి తేదీల్లో, నవంబరు మొదటి వారంలో మండలంలో దాదాపు 20 వేల ఎకరాలకు పైగా నారుమళ్లు పోయనున్నారు. కానీ నేటికీ వ్యవసాయశాఖ వరివిత్తనాల సరఫరా ఊసేలేకుండా నిమ్మకుండిపోయింది. ప్రైవేటుగా విత్తనాలు కొనుగోలు చేయాలంటే వాటి నాణ్యత అన్నదాతలకు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో పలువురు రైతులు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందజేసే రాయితీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు.

తాగునీరు విడుదల



ప్లాంటు నుండి నీరు సంపులోకి వెళుతుండడాన్ని పరిశీలిస్తున్న ఏఈ

లింగసముద్రం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పనిచేసే రాళ్లపాడు-రోళ్లపాడు భారీ మంచినీటి పథకం నుంచి సోమవారం అధికారులు తాగు నీటిని విడుదల చేశారు. సోమవారం ఏఈ రాజశేఖర్ వాటర్ ప్లాంటు నుండి పథకానికి నీటి సరఫరాను విడుదల చేశారు. రాత్రికి ఈ పథకం పరిధిలోని 43 గ్రామాలలోని మంచినీటి ట్యాంకులకు, కొన్ని గ్రామాలలోని సంపులకు నీరు సరఫరా అవుతుందన్నారు. ప్రజలు మంగళవారం ఉదయం నుండి నీటిని పట్టుకోవచ్చన్నారు. ఏఈ వెంట పథకం నిర్వాహకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్ ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల రికార్డులను తనిఖీ చేస్తున్న ఏవో అబ్దుల్ రహీం

కందుకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీధనలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ రహీం సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. డీఏపీ తదితర ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వడం లేదని గమనించి రూ.6.2 లక్షల విలువ గల ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలంటూ నోటీసులు జారీ చేశారు. రైతులకు రశీదులు ఇవ్వకపోయినా, అధిక ధరలకు విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలను తీసుకుంటామన్నారు.

కంట్రోల్ రూము ఏర్పాటు

రాపూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలను వరదల నుండి రక్షించేందుకు రాపూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ లక్ష్మీ నరసింహం తెలిపారు.

మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

● ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ

కావలి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా ఈ నెల 30 వరకు మూడు రోజుల పాటు అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణ ఆదేశించారు. ఎలాంటి విపత్తు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. మండలాలవారీగా తుఫాను వల్ల ఎదురయ్యే సమస్యలను, అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కావలి ఆర్డీవో, మున్సిపల్, విద్యుత్‌శాఖల కార్యాలయాలతో పాటు డివిజన్‌లోని అన్ని మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకుంటూ ఉండాలన్నారు. లోతట్టు, తుఫాను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి, బాధితులను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్దంగా ఉండాలన్నారు. అవసరమైన చోట పురావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కావలి డివిజన్‌లో ప్రమాదకరంగా ఉన్న 34 చెరువుల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఒక ఉద్యోగిని నియమించినట్లు తెలిపారు. అవసరమైతే మరమ్మతులు చేసే విధంగా తగు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి మండలంలో రెండు ఎక్స్‌కవేటర్లను సిద్ధం చేసుకుని, వాటి నిర్వహణను కూడా ఒక ఉద్యోగికి అప్ప గించేలా ఏర్పాట్లు చేశామన్నారు. తుఫాను ప్రమాద ప్రాంతాలను గుర్తించి, అటువైపు ఎవరూ వెళ్ల కుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు అత్యవసర మైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావద్దని ఆర్డీవో సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

బిట్రగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం పర్యటించారు. జువ్వలదిన్నె, సీఆర్‌పాలెం, ఎస్వీపాలెం, ఏనుగులబావి, ముంగమూరు పంచాయతీలను సందర్శించి, అక్కడి తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ తీరప్రాంతంలో ఉన్న 14 తుఫాన్ షెల్టర్లలో 8 మాత్రమే ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. వాటిని శుభ్రం చేయించి పునవాస కేంద్రాలుగా వినియోగించుకునేందు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలకు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు భరత్, ఆర్ఐ రామకుమారి, వీఆర్వోలు హరిబాబు, బాలనరసింహం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కావలి (టౌన్) అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జనతా వారధి కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం పలు సమస్యలపై ఆర్డీవో వంశీకృష్ణకు నేతలు వినతిపత్రం అందించారు. పార్టీ ఒకటవ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. టిడ్కో గృహ సముదాయానికి ప్రహరీ గోడ నిర్మించాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వా సుపత్రిలో జనరేటర్, తగినన్ని ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కందుకూరి సత్యం, బెల్లంకొండ మాల్యాద్రి, సీవీసీ సత్యం, పరుసు వెంకటేశ్వర్లు, సీవీసీ సత్యం, జయకుమార్ పాల్గొన్నారు.

భీకర గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నిలిచేనా!?



జెట్పీ స్కూల్ ఎదురు దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

కావలి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కావలి పట్టణంలో రోడ్ల పక్కన ఉన్న భారీ వృక్షాలు, దెబ్బతిన్న విద్యుత్ స్తంబాలతో ప్రమాదం పొంచి ఉందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనతాపేట, ట్రంక్ రోడ్డు, వెంగళరావునగర్ తదితర ప్రాంతాల్లో భారీ వృక్షాల కారణంగా బిక్కుబిక్కు మంటూ గడపాల్సి వస్తోందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. వర్షాకాలం సమీపించకముందే చెట్ల కొమ్మలు తొలగించి ఆస్థి, ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు చేపట్టాల్సిన పాలకులు, విద్యుత్, మున్సిపల్ అధికారులు సమన్వయ లోపంతో ప్రజల ప్రాణాలు గాలికి వదిలేశారు. దీంతో చిన్నపాటి గాలులు వీచినా చెట్లు, విద్యుత్ తీగలు, స్థంబాలపై పడడంతో ప్రతి ఏటా ఆస్తి నష్టం వాటిల్లుతోంది. ఇటీవల జనతాపేటలో చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఎవరూ అటువైపు రాకపోవటంతో ప్రాణ నష్టం తప్పింది. వాయినందనప్రెస్ వీధిలో ఇటీవల విద్యుత్ స్తంభం విరిగిపడటంతో రాత్రి సమయం కావటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ స్థంబాలు తొలగించాలని అనేక మార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ముందస్తుగా దెబ్బతిన్న విద్యుత్ స్థంబాలు తొలగించటం తో పాటు భారీ వృక్షాల తలకొమ్మలు తొలగించి వృక్షాల తో పాటు ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం

అల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ తీవ్రతరం దాల్చుతున్న తరుణంలో ముందస్తు చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్టు ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని పురిణి పంచాయతీ, అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని పునరావాస కేంద్రాలు, వసతులను ఆయన పరిశీలించారు. తుఫాన్ తీవ్రత నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిందన్నారు. మత్స్యకార గ్రామమైన ఆదినారాయణపురంలోని గ్రామ కాపులతో మాట్లాడారు. ఎలాంటి సమస్య ఉన్నా అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలి

● కలెక్టర్‌కు జేఏసీ నేతల వినతి



కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందచేస్తున్న కందుకూరు జేఏసీ నేతలు

కందుకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో కందుకూరు నియోజకవర్గాన్ని కలిపి ఆప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కందుకూరు జేఏసీ నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ కందుకూరు ప్రజల మనోభావాలకు విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు విభజన చేసి నెల్లూరులో కలిపిందన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో లోకేష్ ఇద్దరు కందుకూరు నియోజకవర్గంను ప్రకాశంలో కలుపుతామని ప్రజలకు మాట ఇచ్చారన్నారు. దీనిలో భాగంగా జిల్లాల మార్పులు చేర్పులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న వేళ కందుకూరును కూడా ప్రకాశంలో కలి పేందుకు సన్నాహాలు చేస్తుండగా నె ల్లూరు జిల్లా నాయకులు మోకాలు అడ్డుతున్నారని సోమవారం ఒక దిన పత్రికలో వార్తా కథనం నియోజకవర్గ ప్రజల ఆశలను నీరుకార్చినట్లు అవుతుందన్నారు. దీనిపై స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌కు కందుకూరు ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేరేలా ప్రకాశంలో కలపాలని వినతి పత్రం అందచేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వారిలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు బెజవాడ ప్రసాద్, పాలేటి కోటేశ్వరరావు, దామా మల్లేశ్వరరావు, ఘట్టమనేని హరిబాబు, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, మోషే తదితరలు ఉన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

●ఆర్టీసీ జోనల్ చైర్మన్



జోనల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

కందుకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి కందుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన కందుకూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలో పనిచేస్తున్న 35 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. అనంతరం కార్తీక మాసం స్పెషల్ బస్సుల కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి వారికి మెరుగైన బస్సులను అందించిందన్నారు. బస్సులతోపాటు, బస్టాండ్ ఆవరణ కూడా పరిశుభ్రంగా ఉంచాలని అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సూచించారు. అనంతరం చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు ప్రసాదు, అసిస్టెంట్ ఇంజనీరు లక్ష్మీ, స్థానిక నాయకులు ఘట్టమనేని హరిబాబు, వరప్రసాదు, వైకుంఠం, బూషయ్య, రాజేష్, మాల్యాద్రి నాయడు, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మొంథా'పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఉలవపాడు : వెంకారెడ్డి కుంట ఎస్టీలను పునరావాస కేంద్రానికి రావాలని సూచిస్తున్న తహసీల్దార్

లింగసముద్రం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె కోటేశ్వరరావు, ఎంపీడీఓ కె శ్రీనివాసులు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో కురిసే భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు దిగువన లోతట్టులో ఉన్న మన్నేరు పరీవాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే సచివాలయాల్లోని సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. తుఫాను సమయంలో కరెంటు, మంచినీరు విషయంలో ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని పెదపవని, వీఆర్ కోట, లింగసముద్రం హైస్కూళ్లలో తుఫాను షెల్టర్లు ఏర్పాటు చేసినట్టు, వీటి నిర్వహణకు మండల స్థాయి అధికారులను నియమించినట్లు చెప్పారు. అలాగే ప్రజలు కూడా ఏదైనా అనారోగ్యం బారిన పడితే వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, సిబ్బందిని సంప్రదించాలన్నారు. సచివాలయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే జనరేటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పశువులు, గొర్రెలు, మేకలను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

●ఉలవపాడు : మొంథా తుఫాన్ తీవ్ర రూపం దాల్చనున్నందున లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు చెప్పారు. మండలంలో రామాయపట్నం, పెద్ద పట్టపుపాలెం, బాలకోటయ్య సంఘం, ఉలవపాడు, మన్నేటికోట గ్రామాల్లో తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు అన్ని సౌకర్యాలతో శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. నిత్యం వారికి అందుబాటులో ఉండేలా గ్రామ, మండలస్థాయి అధికారులను నియమించామన్నారు. వైద్య సిబ్బంది, జనరేటర్, మంచినీళ్లు, శిబిరంలో ఉన్నంత కాలం వారికి ఆహారం, మందులు అందుబాటులో ఉంచామన్నారు. ఇందులో భాగంగా ఉలవపాడులోని ఎంపీడీవో కార్యాలయం పక్కన ఉన్న కోటిరెడ్డికుంట, వెంకారెడ్డి కుంట ఎస్టీలను అధికారుల వెంట పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని తహసీల్దార్ సూచించారు.

'ముంపు ముప్పు' నుంచి రక్షణ ఇలా..

● కావలి పట్టణంలో ముందస్తుగా కాలువల ఏర్పాటు



తుమ్మలపెంట రోడ్డులో పాపిరెడ్డి చెరువు మరవ నీరు వెళ్లేందుకు తీసిన కాలువలు

కావలి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు వస్తే పట్టణంలోని పాతూరు, దళిత వాడలు ముంపునకు గురికాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తుమ్మలపెంట రోడ్డులో వర్షపు నీరు వెళ్లేందుకు అనువుగా ముందస్తుగా సోమవారం ఎక్స్‌కవేటర్‌తో కాలువలు తీశారు. రెవెన్యూ, మున్సిపల్, జలవనరులశాఖాధికారులు దగ్గరుండి సమన్వయంతో కాలువలు తీయించారు. తుమ్మలపెంట రోడ్డులో లేఅవుట్ల నిర్వాహకులు నిర్మించిన ప్రహరీ వల్ల వర్షపు నీరు కిందకు వెళ్లకుండా తుమ్మలపెంట రోడుడ్లవైపు పారుతోంది. మరోవైపు తుమ్మలపెంట రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు ఆక్రమణలకు గురి కావటంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఫలితంగా ఆ ప్రాంతాలు కొన్ని ముంపునకు గురయ్యాయి. అయితే ఈ ఏడాది తుమ్మలపెంట రోడ్డు వేయడంతో ఎత్తు పెరిగి.. పూర్తిగా ఆ ప్రాంతం మునకకు గురయ్యే ప్రమాదం ఉంది. అయితే మొంథా తుఫాన్ ప్రభావంతో అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. తుమ్మలపెంట రోడ్డు ప్రారంభం నుంచి దక్షిణం వైపు ఆక్రమణలకు గురైన ప్రాంతాలలో కాలువలు తీసి వరద నీరు పోయేందుకు మార్గం సుగమం చేశారు. అలాగే దక్షిణం వైపు కూడా దుకాణాల ముందు ఆక్రమణలను తొలగించి కాలువలు తీశారు. కొన్ని చోట్ల కాలువల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని మున్సిపల్ కార్మికులు తొలగించారు.

సకాలంలో యూరియా అందిస్తాం

జలదంకి సొసైటీ అధ్యక్షుడు కరియావుల అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కరియావుల అప్పలనాయుడు

జలదంకి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలంలోని అన్ని గ్రామా ల రైతులకు సకాలంలో యూరియా అందజేస్తామని జలదంకి సొసైటీ అధ్యక్షుడు కరియావుల అప్పలనాయుడు పేర్కొన్నారు. జలదంకి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. వరి మడులు సిద్దం చేయకమునుపే రైతులకు యూరియా ఇవ్వలేదని వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. పార్టీలకతీతంగా ప్రతీ రైతన్నకు యూరియా అందిస్తామన్నారు. వింజమూరు ఏడీఏ శేషగిరిరావు మాట్లాడుతూ వరిసాగు చేసే రైతులకు ఎకరానికి మూడుబస్తాల వంతున యూరియా అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఓ శ్రీవాణి, సోమశిల ప్రాజెక్ట్ ఉపాధ్యక్షుడు వీ మధుమోహన్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, బీజేపీ, జనసేన మండల అధ్యక్షులు ముడి కిషోర్ రెడ్డి, తోట మురళీ, పీఏసీఎస్ డైరెక్టర్లు జానీ, మధుసూదనరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం!

● చినుకు పడితే ప్రజలకు నరకయాతన



ముసునూరు దివ్యాంగుల కాలనీ వద్ద రొచ్చు రోడ్లు



ఇందిరమ్మ కాలనీలో బురద రోడ్లు

కావలి(టౌన్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక అంతర్గత రోడ్లు అధ్వానంగా మరి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పేరుకే మున్సిపాలిటీ గానీ ఇక్కడి వాతావరణం చూస్తే పల్లెటూర్ల కంటే దారుణంగా ఉంది. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా ప్రాంతాల్లో పరిస్థితి దుర్భరంగా మారింది. గతంలో నిర్మించిన రోడ్లు పాతబడి వర్షాలకు పగిలి గుంతలు ఏర్పడ్డాయి. వాటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. సీసీ రోడ్లు లేక వాహనదారులు, పాదచారులు ప్రయాణాలు సాగించాలంటే ఇబ్బందికరంగా ఉంది. దీనికి తోడు అనేక ప్రాంతాల్లోని రోడ్లకు డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తూ దుర్భరంగా మారింది. వర్షాలు పడినప్పుడు మట్టిరోడ్లు కాస్త బురద రోడ్లుగా మారడం డ్రైన్ కాలువల మురుగు అందులో చేరడంతో ప్రజలు కాలు కిందపెట్టలేని దుస్థితి నెలకొంటుంది. వాహనాలు బురదలో ఇరుక్కుని ముందుకు కదలక వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ముసునూరు ఇందిరమ్మ కాలనీ, వినాయక కాలనీ, చంద్రబాబు నగర్, కావేటి గుంట కాలనీ, జొన్నాయగుంట కాలనీ తదితర కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక అక్కడ నివసించే గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. గత 25 ఏళ్ల నుంచి ఇదే దుస్థితి నెలకొన్నప్పటికీ కాలనీలను పాలకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

జగనన్న రూ.100 కోట్ల హుష్ కాకే..

గత వైసీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కావలి పర్యటనలో భాగంగా ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నామని స్వయంగా చేసిన ప్రకటన హుష్ కాకే అయింది. రూ.100 కోట్లు కాదు కదా రూ.100 కూడా కాలనీ అభివృద్ధికి ఖర్చు చేసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా కాలనీల్లో మౌలిక వసతుల కల్పన చేపడతారని అక్కడి ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

మాలేపాటి కుటుంబమంటే టీడీపీ కుటుంబమే!



దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 27 (ఆం ధ్రజ్యోతి): మాలేపాటి కుటుంబం అంటే టీడీ పీ కుటుంబమేనని స్థానిక టీడీపీ నేతలు తా ళ్ళూరు సుధాకర్‌నాయుడు, శ్రీహరి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యకర్తలతో కలిసి దగదర్తిలో మాలేపాటి సుబ్బా నాయు డు, మాలేపాటి భానుచందర్ నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం మాలేపాటి రవీంద్ర నాయుడు, కుటుంబ సభ్యులను కలిసి మా ట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నా యకులు పులి శీనయ్య వట్టికాల శీనయ్య, మారుబోయిన గోపాల్, తడకలూరు గ్రామ స్తులు తదితరులు పాల్గొన్నారు.

అరణియార్ @ 28.8 అడుగులు



స్పిల్‌వే గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

మల్లిమడుగుకు పెరిగిన ప్రవాహం



పిచ్చాటూరులోని అరణియార్ రిజర్వాయర్ సోమవారం సాయంత్రానికి 28.8 అడుగులకు (1.525 టీఎంసీలు) చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 32 అడుగులు(1.853 టీఎంసీలు) కాగా, 31 అడుగులు నిల్వ ఉంచుతారు. ప్రస్తుతం అరుణానది, యాలం కాలువల ద్వారా రిజర్వాయరులోకి 400 క్యూసెక్కుల నీళ్లు వస్తుండగా, అంతే మొత్తంలో రెండు స్పిల్‌వే గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు.

- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి

రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యామ్‌కు సోమవారం తెల్లవారుజాము నుంచి నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఆరు గేట్లను ఒక అడుగుపైకి లేపి నీటిని కిందకు విడుదల చేశారు. ప్రస్తుతానికి 700 క్యూసెక్కుల నీరు డ్యామ్‌లోకి వస్తుండగా 800 క్యూసెక్కులను కిందకు విడుదల చేశారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

వర్షంలోనూ 'కార్తీక' వెలుగులు



కపిలతీర్థం పక్కన ఉద్యానవనంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తిరుపతి నగరం కపిలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక తొలి సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఈసారి ఆలయం లోపల కార్తీక దీపాలను వెలిగించడానికి అధికారులు అనుమతించలేదు. ఆంజనేయ స్వామి సన్నిధి సమీపంలోని ఉద్యానవనంలో అనుమతివ్వడంతో అక్కడే దీపాలు వెలిగించారు. పిండి, నిమ్మకాయలు, ఉసిరి కాయల్లో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షం కురుస్తున్నా.. తడుస్తూనే కొందరు, గొడుగుల కింద మరికొందరు దీపాలు వెలిగించారు. జలపాతం ఉధృతి కారణంగా కపిలతీర్థంలోకి అనుమతించకుండా ఫెన్సింగ్ వేశారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

ఆరెంజ్ అలర్ట్



కోట మండలం శ్రీనివాససత్రం వద్ద పరవళ్లు తొక్కుతూ ముందుకు వచ్చి ఉన్న సముద్రం

- నేడు భారీ వర్ష సూచన
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవు
- బీచ్‌లు, జలపాతాలకు రాకపోకల నిషేధం

సోమవారం: 'మొంథా' ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మబ్బులు కమ్ముకుని చలిగాలులతో పాటు అడపాదడపా జల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో సముద్రతీరం వద్ద అలలు ఎగిసిపడుతున్నాయి.

మంగళవారం: భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. దీటుగా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది.

తీర ప్రాంతంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

జిల్లాకు రెండు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వచ్చాయి. కోట, వాకాడు, చిల్లకూరు వంటి సముద్ర తీర ప్రాంత మండలాలలో సహాయక చర్యల కోసం ఒక బృందాన్ని గూడూరులోను.. మరో బృందాన్ని సూళ్ళూరుపేటలో వుంచారు. పులికాట్ సరస్సు పరంగా ఇబ్బందులు తలెత్తితే తడ, సూళ్ళూరుపేట మండలాలకు, స్వర్ణముఖి, కాళంగి నదుల పరంగా ఇబ్బందులు ఎదురైతే నాయుడుపేట, శ్రీకాళహస్తి తదితర మండలాలకు త్వరగా చేరుకునేలా అక్కడ ఉంచారు.

తిరుపతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మంగళవారం జిల్లాకు భారీ వర్ష సూచన చేసింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. సెలవులు పెట్టిన ఉద్యోగులు, అధికారులు జిల్లాలో అందుబాటులో ఉంటే.. సెలవులను రద్దు చేసుకుని విధుల్లో చేరాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచీ ఆయన రెవెన్యూ, పోలీసు, ఫైర్, వైద్యారోగ్య, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, వ్యవసాయ వంటి కీలక శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. సంబంధిత శాఖల క్షేత్రస్థాయి ఉద్యోగులు 24 గంటలూ కార్యక్షేత్రంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్ పనులు ఆపేసి.. అక్కడ వినియోగించే ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు సిబ్బందితో పాటు జిల్లా యంత్రాంగానికి అందుబాటులో ఉంచాలన్నారు. ఇక, కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లోని సముద్ర తీర ప్రాంతంలో బీచ్‌ల వద్దకు పర్యాటకుల రాకపోకలను బుధవారం వరకూ నిషేధించారు. ఈ మూడు చోట్ల సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతుండడంతో ముందుజాగ్రత్తగా పర్యాటకులను అనుమతించడం లేదు. జిల్లాలోని అన్ని జలపాతాల వద్దకూ బుధవారం వరకు రావొద్దంటూ పర్యాటకులకు అధికారులు సూచించారు. ఇప్పటికే సోమవారం నుంచీ బుధవారం వరకూ మూడు రోజుల పాటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన సంగతి తెలిసిందే.





తిరుచానూరు వద్ద స్వర్ణముఖి నదికి వెళ్లేదారిని బారికేడ్లతో మూసేశారిలా.. - తిరుపతిలోని కపిలతీర్థంలో పుష్కరిణిలోకి కార్తీక దీపాలు వెలిగించేందుకు భక్తులను అనుమతించకుండా అడ్డుగా వేసిన ఫెన్సింగ్

తుఫాను హెచ్చరికల తీవ్రత దృష్ట్యా కలెక్టరేట్, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు ఆర్డీవో కార్యాలయాలతో పాటు అన్ని మున్సిపల్.. తహసిల్దారు కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఇవి 24 గంటలూ పనిచేయనున్నాయి. సమస్యలపై ప్రజలు కంట్రోల్ రూమ్‌లకు సమాచారం ఇస్తే.. పరిస్థితికి అనుగుణంగా వారు స్పందిస్తారు. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి నేరుగా ఫిర్యాదులు, సాయం కోసం అభ్యర్థనలు చేయడానికి, అత్యవసర సమాచారం ఇవ్వడానికి టోల్ ఫ్రీ నెంబర్ కూడా ప్రకటించారు.

తీర ప్రాంతంలో ప్రత్యేకాధికారి పర్యటన



నాయుడుపేటలో ఆర్డీవో, తహసీల్దారులకు సూచనలు ఇస్తున్న ప్రత్యేకాధికారి అరుణబాబు

తుఫాను సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారి అరుణ్‌బాబు సోమవారం జిల్లాకు చేరుకున్నారు. సమీక్షా సమావేశాలకు పరిమితం కాకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించారు. అందులో భాగంగా వాకాడు, చిల్లకూరు మండలాల్లో పర్యటించి ఆయా మండలాల తహసీల్దారు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో కిరణ్మయి, ఇతర అదికారులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మొత్తానికీ మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది.

కడలి కల్లోలం



దొరువుకట్ట వద్ద కోతకు గురైన స్వర్ణముఖి పొర్లుకట్టను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

కోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం గ్రామాల సమీపంలోని సముద్రం సోమవారం కల్లోలభరితంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. 30నుంచి 40 మీటర్లలోతు సముద్రం అలల ఉద్రిక్తతో ముందుకు వచ్చిందని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. వాకాడు మండలం తూపిలిపాళెంలో రాకాశి అలలు 5 మీటర్ల మేర ఎగిసిపడుతున్నాయి. కోట తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆయా గ్రామాలకు వెళ్లి మత్స్యకారులకు ధైర్యం చెప్పారు. ఇక, స్వర్ణముఖి పొర్లుకట్టలు బలహీనంగా ఉన్న పుచ్చలపల్లి, అల్లంపాడు, దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల్లో రెడ్‌అలెర్ట్ ప్రకటించారు. అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మైక్‌ల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి గూడలిలోని స్వర్ణముఖి నది ప్రవాహ తీరును.. దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల్లో పొర్లుకట్టలను పరిశీలించారు. ఇక, తీరంలో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. పర్యాటకులను సముద్రంవద్దకు రాకుండా పోలీసులు, మెరైన్ పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. మరోవైపు ఆక్వా గుంతలలో తక్కువ కౌంట్‌తోనే రొయ్యలను పట్టి రైతులు సొమ్ము చేసుకుంటున్నారు.

'గంగ'లో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

- కారు డ్రైవరు కోసం గాలింపు

వరదయ్యపాళెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు గంగ కాలువలో గల్లంతైన ఇద్దరిలో బాలుడి మృతదేహం సోమవారం దొరికింది. కారుడ్రైవరు ఆచూకీ లభ్యం కాలేదు. వరదయ్యపాళెం మండలానికి చెందిన ఇరిగేషన్ శాఖ ఏఈ బాబు తన కారు కడిగేందుకు డ్రైవర్ షరీఫ్ అలియాస్ చిట్టి (40), తన మనవడు మహిత్(6)తో కలిసి ఆదివారం సాయంత్రం ఉబ్బలమడుగు సమీపంలోని తెలుగుగంగ కాలువ ర్యాంపులో వాహనాన్ని దించారు. ఆ సందర్భంగా డ్రైవర్ షరీఫ్, బాలుడు మహిత్ నీటి ప్రవాహంలో కొట్టుకు పోయిన సంగతి తెలిసిందే. వీరికోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆదివారం నుంచి గాలింపుచర్యలు చేటపట్టారు. మరోవైపు గజ ఈతగాళ్లు, రెస్క్యూ టీం బోటుసాయంతో కాలువలో తీవ్రంగా గాలించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉబ్బలమడుగు చెక్‌పోస్ట్ సమీపంలో 121 కి.మీ. వద్ద బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. షరీఫ్ కోసం రెస్క్యూ టీం గాలింపు చర్యలు చేపడుతోంది. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహ మూర్తి, రూరల్ సీఐ తిమ్మయ్య, బుచ్చినాయుడు కండ్రిగ తహసీల్దార్ శ్రీదేవి, ఎస్‌ఐ హరిప్రసాద్ సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తుఫాన్‌పై ఆందోళన వద్దు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై ఆందోళన వద్దని, ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం చెప్పారు. రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే వదంతులు నమ్మొద్దన్నారు. భద్రత, మనుగడకు అవసరమైన వస్తువులను సిద్ధం చేసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని వారు పునారావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు. ఎలక్ట్రికల్, గ్యాస్ వంటి వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాల వద్ద ఉండొద్దని సూచించారు. ఈ మూడు రోజులు మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదన్నారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

కలెక్టరేట్ కార్యాలయం: 0877-2236007

తిరుపతి ఆర్డీవో కార్యాలయం: 70321 57040

శ్రీకాళహస్తి: 85550 03504

గూడూరు: 08624-252807, 85000 08279

సూళ్లూరుపేట: 086232 95345, టోల్ ఫ్రీ నెంబరు 18004250101

అత్యవసరమైతేనే బయటకు రండి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం అన్నారు. ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 'అత్యవసరమైతే తప్ప వర్షంలో బయటకు వెళ్లొద్దు. అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దు. నీళ్లున్న ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల వద్దకు పిల్లలు వెళ్లకుండా చూసుకోండి. ఉధ్రుత ప్రవాహాల నేపథ్యంలో ఈత, స్నానం కోసం దిగొద్దు. శిథిల ఇళ్లల్లోని వారు అధికారులు చెప్పిన వెంటనే పునరావాస కేంద్రాలు లేదా బంధువుల ఇళ్లకు వెళ్లండి. ఏదైనా ప్రమాదం గమనించినా, విద్యుత్ వైర్లు తెగిపడినా, చెట్లు కూలినా, ఇళ్లలోకి నీళ్లు చేరినా అత్యవసర హెల్ప్‌లైన్ 112కు సమాచారమివ్వండి. ప్రజల్లో భయాందోళనలు సృష్టించేలా తుఫాన్ తీవ్రతపై తప్పుడు సమాచారం లేదా వదంతులను సోషల్ మీడియాలో ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలూ అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మండి' అంటూ ఎస్పీ కోరారు.

'మొంథా' పట్ల అప్రమత్తంగా ఉండండి

డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ● సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా వుండాలని సీఎండీ శివశంకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించాం. సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. తుఫాను తీరం దాటేవరకు అందరికీ సెలవులు రద్దు చేశాం. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. విద్యుత్ స్తంభాలు ఒరిగిన వెంటనే మరమ్మతులు చేయడానికి సిద్ధంగా ఉండాలి. కూలీలను అందుబాటులో ఉంచుకోవాలి. విద్యుత్ స్తంభాలు పడిపోయినపుడు, వైర్లు తెగినపుడు ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి టోల్ ఫ్రీ నెంబర్లు 1912 లేదా 1800 425 155333 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. సంస్థ వాట్సాప్ నెంబరు 91333 31912కు చాట్ చేయాలి' అని ఆ ప్రకటనలో సీఎండీ సూచించారు.

ఎవరైనా లంచం అడిగితే 1064కు సమాచారం ఇవ్వండి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనులకోసం ఎవరైనా లంచం అడిగితే వెంటనే 1064కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని అవినీతి నిరోధక శాఖ ఏఎస్పీ విమల కుమారి విజ్ఞప్తిచేశారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం తిరుపతిలోని ఏసీబీ ఆధ్వర్యంలో అవగాహనా కార్యాక్రమం నిర్వహించారు. ఏసీబీ సిబ్బందిచే అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞచేయించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు.. ర్యాలీలు, సైకిల్ మారథాన్లు నిర్వహిస్తామన్నారు.



కొడాలి నాని, పేర్ని నాని

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.., వైసీపీ మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, సినీనటులు రాకేష్, సుజాత ఉన్నారు. అంతకుముందు కర్ణాటక శ్రీకూడలి ఆర్య అక్షభ్య మఠాధిపతి రఘువిజయతీర్థ స్వామిజీ కూడా ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.



రాకేష్, సుజాత దంపతులు


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,021

తలనీలాలు సమర్పించినవారు: 25,894



ఆర్టీసీ అప్రమత్తం

- ఏసీ బస్సుల కండిషన్‌పై ముమ్మర తనిఖీలు
- వేగ నియంత్రణకూ చర్యలు



అమరావతి ఏసీ బస్సు ఇంజన్‌ను తనిఖీ చేస్తున్న సిబ్బంది



బస్సులో అత్యవసర ద్వారం పరిశీలన

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 'కర్నూలు' ప్రమాదం నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. బస్సుల కండిషన్‌పై మూడు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 డిపోలుండగా మంగళం డిపో ద్వారానే 23ఏసీ బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సులన్నీ కాలపరిమితి ముగిశాయి. నూతన బస్సులు రాకపోవడంతో ఉన్న బస్సులకే ఎప్పటి కప్పుడు విడిభాగాలను మారుస్తూ, రంగులు వేస్తూ నెట్టుకొస్తున్నారు. మొన్నటి వరకు దీన్ని పెద్దగా పట్టించుకోకపోయినా.. ఇప్పుడు అధికారుల్లో ఆందోళన నెలకొంది. దీంతో అన్ని బస్సుల కండిషన్, అదనపు సౌకర్యాలు కల్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో మంగళం డిపోలో అమరావతి, వెన్నెల, ఇంద్రా బస్సుల్లోని విడి భాగాలను తనిఖీ చేస్తున్నారు. బస్సు ముందు, వెనుక రెండు అగ్నినివారణ యంత్రాల ఏర్పాటు, ప్రతి కిటికీ వద్ద సేఫ్టీ హ్యామర్స్, అత్యవసర ద్వారాలు, ఎలక్ట్రిక్ విధానం మెరుగుపరచడం, ఆయిల్ లీకేజీ కాకుండా చర్యలు చేపట్టారు. బ్రేక్స్, స్టీరింగ్‌ను మరింత సరిచేయడం, డ్రైవర్ల భద్రతకు హెడ్, ఫాగ్, సిగ్నల్స్ లైట్స్, వైపర్స్‌ను నూతనంగా ఏర్పాటు చేయనున్నారు. ఇంజన్ చెక్ చేస్తున్నారు. లాంగ్ సర్వీసుల్లో ఇద్దరు డ్రైవర్లను విధిగా పంపడం, బస్సులో డ్రైవర్ విశ్రాంతికి ప్రత్యేక సీటు ఏర్పాటు, ఓల్వో ట్రైనింగ్ అయిన డ్రైవర్లనే అనుమతించడం, డ్యూటీ ఎక్కేసమయంలో ప్రతి డ్రైవర్‌ను అప్రమత్తం చేయడం, డ్రైవర్లచే ప్రయాణికులకు రక్షణ ఏర్పాట్లు వంటి వాటిపై అవగాహన కల్పించే చర్యలు తీసుకున్నారు. అమరావతి బస్సు స్పీడు 90కిలోమీటర్లు, ఇంద్రా, వెన్నెల 80కిలోమీటర్ల వేగాన్ని అధిగమించకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు. ప్రయాణంలో సమయపాలన కచ్చితంగా పాటించేలా డ్రైవర్లకు డిపో మేనేజర్ సుధాకర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే, తిరుమల, రేణిగుంట, మదనపల్లె, కడప, నెల్లూరుకు నడుస్తున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సులలో కూడా చెకింగ్ జరుగుతున్నాయి. అద్దె బస్సుల యాజమాన్యం కాస్త నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు ఆరోపణలున్నాయి.

370 సప్తగిరి బస్సులతో హైటెన్షన్

2018వ సంవత్సరం ముందు వచ్చిన దాదాపు 370సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఘాట్‌లో తిరుగుతూ.. వీటి కాల పరిమితి ఆరు లక్షల కిలోమీటర్లను అధిగమించాయి. ప్రస్తుతం 9-10లక్షల మధ్య నడుస్తుండటంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో కొన్ని విడిభాగాలు మార్చి..సాంకేతికతను మెరుగు పరిచినా.. మళ్లీ వీటి కండిషన్‌ను తనిఖీ చేస్తున్నారు.

ఇతర బస్సులపైనా ప్రత్యేక దృష్టి : జిల్లాలోని మిగతాపాతబస్సుల కండిషన్, బ్రేక్‌సిస్టమ్, స్టీరింగ్, ఇంజన్, ఇతర భాగాల పనితీరు, లైటింగ్, ఎలక్ట్రిక్ సిస్టమ్స్‌ను తనిఖీచేసి మరింత మెరుగుపరిచే చర్యలు చేపట్టారు. పూర్తిస్థాయిలో ఫిట్‌గా ఉంటేనే రోడ్డెక్కించాలని డీపీటీవో జగదీష్ ఆయా డిపోమేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. అద్దెబస్సుల యజమానులతోనూ స మావేశమై వాటి కండిషన్ తనిఖీ చేయించాలని కోరారు.

వేగానికి అదుపేదీ?

- దూసుకెళ్తున్న ప్రైవేటు బస్సులు
- ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు, ఎఫ్‌సీలు
- డొల్ల తనిఖీలతో రోడ్లపై ఫిట్‌లెస్ వాహనాలు
- ఆగని ప్రమాదాలు



రేణిగుంట వద్ద గతేడాది ప్రమాదంలో కాలిన బస్సు (ఫైల్ ఫొటో)

- గతేడాది మే 19న ఓ ట్రావెల్ బస్సుకు రేణిగుంట వద్ద టైర్లు పేలాయి. దాదాపు 10 మంది గాయపడ్డారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 2న నగరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బస్సు నుజ్జు నుజ్జు అయింది. ఇద్దరు మృతి చెందగా 10 మంది గాయపడ్డారు.
- ఈ నెల 23న ఉదయం ప్రైవేటు ట్రావెల్ బస్సుకు పెన్నేపల్లి వద్ద మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది.
- ఈ నెల 24న వాకాడు డిపో పల్లె వెలుగు ఆర్టీసీ బస్సుకు తుమ్మూరులో బ్రేక్ డ్రమ్‌లో నుంచి పొగలు వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు.

\- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

జిల్లాలో అడపాదడపా బస్సు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రైవేట్ బస్సులే ఎక్కువ. సంఘటన జరిగినప్పుడల్లా అధికారులు హడావుడి చేయడం, తర్వాత మిన్నకుండిపోవడం సాధారణమైపోయింది. తాజాగా కర్నూలులో జరిగిన ఘోర దుర్ఘటనతో అందరూ ఒక్కసారిగా గగుర్పాటుకు గురయ్యారు. ఈ క్రమంలో మన దగ్గర ప్రైవేట్ బస్సుల సామర్థ్యం పరికిస్తే డొల్లతనమే బయటపడుతోంది. కలవరపాటు కలిగిస్తోంది. బాధ్యత వహించాల్సిన రవాణాశాఖ నామమాత్రపు తనిఖీలకే పరిమితమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో ప్రైవేటు బస్సులకు సంవత్సర ట్యాక్సు అతి తక్కువ. దీంతో 80 శాతం ప్రైవేటు ట్రావెల్ బస్సులు మిజోరాం, నాగాలాండ్, అరుణాచలప్రదేశ్, డయ్యూ డామన్ వంటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయి. తిరుపతి నుంచి దాదాపు 40 నుంచి 50 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు వివిధ ప్రాంతాలకు నడుపుతున్నారు. వీటి సామర్థ్యంపై ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది.

కొంపముంచుతున్న నకిలీ ఎఫ్‌సీలు

ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న ట్రావెల్స్ యాజమాన్యాలు అక్కడే ఇన్సూరెన్సు, ఎఫ్‌సీలు తీసుకుంటున్నాయి. ట్రావెల్స్ బస్సుకు రెండేళ్లకోసారి ఎఫ్‌సీ చేసుకోవాలి. తిరుపతి మీదుగా తిరుగుతున్న బస్సులకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రాంతంలో రవాణా శాఖ అధికారులు తనిఖీ చేసి, ధ్రువీకరించాక రాకపోకలు సాగించాలి. అక్కడకు వెళ్లకుండా ఎఫ్‌సీలు తెచ్చుకుంటున్నారని తెలుస్తోంది. దీంతో ఇక్కడి రవాణా శాఖ అధికారులు కూడా వాటికి జోలికి పోవడంలేదు. ఫలితంగానే తరచూ ఏదో ప్రమాదం జరుగుతోందనే వాదన ఉంది. కొన్ని పూర్తిగా పాతవైపోయాయి. నాన్ ఏసీ బస్సులను ఏసీ బస్సులుగా మార్చేటప్పుడు నాణ్యత లేని మెటీరియల్ వాడుతున్నారని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

అడ్డూ అదుపులేని వేగం

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల వేగానికి అడ్డూఅదుపూ లేకుండాపోతోంది. గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతున్నాయి. తిరుపతి నుంచి విజయవాడకు ఆరేడు గంటల్లో దూసుకుపోతున్నాయి. వేగాన్ని నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు నెలవారీ మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా వీరు తమ అధికారాలను వినియోగిస్తే వేగంలాంటి అంశాలకు బ్రేకులు పడతాయి.

ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం

జిల్లాలో ప్రైవేట్ బస్‌లను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. ప్రయాణికుల పరిమితి దాటినా, ఫిట్‌నెస్, ఎఫ్‌సీ, ఇన్సూరెన్సులు లేకుండా రోడ్లపైకి వచ్చినా అపరాధం విధిస్తున్నాం. ఇప్పటివరకు కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై 565 కేసులు నమోదు చేశాం. దాదాపు రూ.42.95 లక్షలు జరిమానా కింద వసూలు చేశాం.

\- మురళీమోహన్, జిల్లా రవాణా శాఖ అధికారి

తిరుమలలో ముసురు



ఆలయం ముందు కురుస్తున్న జల్లులు

తిరుమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం తిరుమలలో వేకువజాము నుంచే ముసురు వాతావరణం కనిపించింది. చిరుజల్లులే కావడంతో భక్తులకు పెద్దగా అసౌకర్యం కలుగలేదు. ఉండిఉండీ దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేస్తోంది. సాయంత్రానికి చలి తీవ్రత పెరిగింది. తుఫాన్ ప్రకటనల నేపథ్యంలో రద్దీ కూడా తక్కువగానే ఉంది. ఆలయ పరిసరాల్లో భక్తులు పలుచగా కనిపించారు. పదిరోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుమల ఘాట్‌రోడ్లపై ఫారెస్ట్, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. తరుచూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలపై దృష్టి పెట్టారు. అనుకోకుండా కొండరాళ్లు, చెట్లు విరిగిపడితే వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఘాట్‌రోడ్లలో నెమ్మదిగా ప్రయాణించాలని, చెట్ల కింద ఉండకూడదంటూ ప్రకటనలు చేశారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

- 19 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం/నారాయణవనం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరు స్మగ్లర్లను అరెస్టుచేసి 19 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ ఈశ్వరరెడ్డి బృందం ఆదివారం కైలాసకోన నుంచి కూంబింగ్ చేపట్టారు. సోమవారం నారాయణవనం సమీపంలోని సింగారకోన రోడ్డు కన్నికలమ్మ ఆలయం సమీపానికి చేరుకోగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద రీతిలో టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటపడ్డారు. టాస్క్‌ఫోర్సు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని విచారించగా పరిసర ప్రాంతాల్లో ఎర్రచందనం దుంగలు దాచి ఉంచినట్లు చెప్పారు. వారు దాచిన 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని పట్టుబడిన వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని స్థానికులుగా గుర్తించారు. దుంగలతో పాటు స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా కార్మికుడి హత్య

చిల్లకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మినపట్నం గ్రామ సమీపంలోని సాగరమాల రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్న ఇద్దరు కార్మికుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి హత్యకు దారితీసింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన నరసింగ్ ఓరమ్(28), సమీర్ నాయక్ మండలంలోని తమ్మినపట్నం గ్రామ సమీపంలోని సాగరమాల రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్నారు. ఆదివారం రాత్రి మద్యం తాగుతుండగా ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో సమీర్‌నాయక్ ఇనుపరాడ్డుతో నరసింగ్ ఓరమ్‌ను కొట్టాడు. అతనికి తీవ్రంగా గాయాలు కావడంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం నరసింగ్ ఓరమ్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సియోల్‌లో శ్రీసిటీ బృందం పర్యటన



కొరియా ప్రతినిధులతో శ్రీసిటీ బృందం

సత్యవేడు, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడులు, వ్యాపార విస్తరణలో భాగంగా శ్రీసిటీ మార్కెటింగ్ బృందం కొరియాలో పర్యటిస్తోంది. శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ నేతృత్వంలో సియోల్‌లోని భారత రాయబార కార్యాలయ డిప్యూటీ కమిషనర్ చీఫ్ నిషికాంత్ సింగ్, జపాన్ ఉన్నతాధికారులు కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతి, 31 దేశాలకు చెందిన 240కు పైగా పరిశ్రమలను ఆకర్షించడంలో శ్రీసిటీ పాత్రను వివరించారు. ఎల్జీ, సోలుమ్, హ్యాందాయ్, ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ (హెచ్‌డీసీ), ఎస్కే ఫ్యుకేర్, ఎల్జీ పాలిమర్స్ వంటి ప్రముఖ కొరియన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వారికి వివరించారు. అలాగే సియోల్‌లో జరిగిన కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ ఐటీ ప్రదర్శన (కేఈఎస్ 2025)ను సందర్శించారు. కొట్రా (కొరియా ట్రేడ్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ ఏజెన్సీ) అధికారులు, ఇతర వ్యాపార ప్రతినిధులతో వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించి, పెట్టుబడి భాగస్వామ్య అవకాశాలను చర్చించారు. శ్రీసిటీ వేగవంతమైన పురోగతిని వివరించిన నిషికాంత్ సింగ్ భవిష్యత్ కొరియా పెట్టుబడులకు తన మద్దతు తెలిపారు. శ్రీసిటీ బృందం సియోల్ పర్యటన శ్రీసిటీ, కొరియన్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలపరుస్తుందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు.





నారద పుష్కరిణిలో ఏర్పాటు చేసిన దీపాలు, దీపాలు వెలిగిస్తున్న ఈవో దంపతులు

శ్రీకాళహస్తిలో లక్ష దీపోత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ నారద పుష్కరిణిలో కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. పుష్కరిణి చుట్టూ క్రమపద్ధతితో నేతిదీపాలను ఆలయాధికారులు సిద్ధం చేశారు. పుష్కరిణి ప్రాంగణంలో స్వామి అమ్మవార్ల చిత్రపటానికి పూజలు చేసి హారతులు సమర్పించారు. అనంతరం ఈవో బాపిరెడ్డి దంపతులు నేతి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు. కార్తీకమాసం తొలి సోమవారం నేపథ్యంలో ముక్కంటి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు



నిందితులను సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల చొప్పున జైలు శిక్షతో పాటు రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన సుబ్రమణి సతీష్ కుమార్, తిరువణ్ణామలైకి చెందిన కుల్లయన్ వెంకటేష్ ఎర్రచందనం చెట్లను నరికేందుకు తిరుపతి అటవీశాఖ పరిధిలోని పెరుమాళ్లపల్లె, టీఎన్‌పాళెంలోని శేషాచల అడవిలోకి ప్రవేశించారు. వీరిని పట్టుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. వీరిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఇద్దరు స్మగ్లర్లను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ వాదనలు వినిపించారు. ఎర్రచందనం చెట్లను నరికేందుకు అక్రమంగా ప్రవేశించే వారికి.. ఈ తీర్పు ఓ హెచ్చరిక అవుతుందని టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

రెండు కిలలో గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిని తిరుపతి పోలీసులు సోమవారం అరెస్టుచేశారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి, ఒక స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. తిరుపతి కోలా వీధికి చెందిన షేక్ సందానీ, చిన్నం చెట్టి బద్రినాథ్, గిరిపురానికి చెందిన ధనుష్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరిలో షేక్ సందానీ కొద్దిరోజుల క్రితం వైజాగ్ వెళ్లి కిలో రూ.7500 చొప్పున రెండు కిలోల గంజాయి కొన్నాడు. రైలులో విజయవాడకు.. అక్కడ్నుంచి బస్సులో రేణిగుంటకు చేరుకున్నాడు. మిగతా ఇద్దరూ స్కూటర్‌లో అక్కడికి చేరుకుని.. గంజాయితో పాటు సందానీని తీసుకుని తిరుపతికి బయలుదేరారు. ఈ గంజాయిని చిన్న పొట్లాలు చేసి, పొట్లం రూ.200 నుంచి, 300కు అమ్మాలన్నది వీరి ఉద్దేశం. దీనిపై అందిన సమాచారంతో డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది రామానుజ సర్కిల్ వద్ద కాపుకాసి వారిని పట్టుకున్నారు.



అనుసంధానం చేసేందుకు వ్యాబ్‌కు తరలిస్తున్న సీఎంఎస్-03 ఉపగ్రహం - రాకెట్ మొదటి దశ - రాకెట్ రెండో దశ - రాకెట్ మూడో దశ



రెండో ప్రయోగ వేదికపై ఎల్వీఎం3-ఎం5 రాకెట్

మరో ప్రయోగానికి షార్ సిద్ధం

మరో ప్రయోగానికి షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సిద్ధమైంది. ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 4,400 కిలోల బరువైన సీఎంఎస్-03 (జీశాట్-7ఆర్) కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపేందుకు శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. వ్యాబ్‌లో రాకెట్ అనుసంధాన పనులు పూర్తి చేసి రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలించారు. సోమవారం లెవల్ 1, లెవల్ 2 తనిఖీలు చేసి పలు పరీక్షలు చేశారు. కాగా, రాకెట్‌ను దశలవారీగా అనుసంధానించిన ఫొటోలను ఇస్రో సోమవారం విడుదల చేసింది.

\- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



వ్యాబ్ నుంచి రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలిస్తున్న దృశ్యం

ఆలయాల్లో కార్తీక పూజలు



నాగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు శివనామస్మరణాలతో మార్మోగాయి. వర్షంలోనూ ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. నాగేశ్వరస్వామి ఆలయంలో శివుడికి అభిషేకం చేసి పుష్పాలతో అలంకరించారు. అదే విధంగా టీడీపీ కార్యాలయం వద్ద అభయ శంకరుడి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, కమిటీ సభ్యులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నమాంబట్టులో ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆలయంలో కార్తీక మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గోపూజ నిర్వహించారు. విశిష్ట పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలకు ఇండ్ల ప్రభాకర్, భాగ్యవతి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి సిమ్స్ వైద్యుడు మునస్వామి, గ్రామస్తులు వేనాటి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కండక్టరును దూషించిన హౌసింగ్ ఏఈ

పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

బాలాయపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళా కండక్టరును దూషించిన హౌసింగ్ ఏఈపై పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటగిరిలో గృహనిర్మాణ శాఖ ఏఈగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం సోమవారం గూడూరు వెళ్లే పల్లె వెలుగు బస్సు ఎక్కి కండక్టర్ సీట్‌లో కూర్చున్నారు. ప్రయాణికులకు టికెట్లు ఇవ్వడం పూర్తయ్యాక కండక్టర్ కస్తూరమ్మ తన సీటు వద్దకు వచ్చారు. ఏఈ సుబ్రహ్మణ్యంను మరో సీటులో కూర్చోవాలని కోరగా వినిపించుకోకుండా వివాదానికి దిగారు. ఈ క్రమంలో అసభ్యంగా దూషించారు. దీంతో బాలాయపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద బస్సు ఆపి ఏఈ సుబ్రహ్మణ్యంపై కండక్టర్ కస్తూరమ్మ ఫిర్యాదు చేశారు. బస్సులో ప్రయాణికులు కూడా సుబ్రహ్మణ్యం కండక్టరును దూషించారని చెప్పడంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ జార్ఖండ్ మహిళ మృతి

నాయుడుపేట టౌన్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజేష్‌బుయ్యాన్ రెండేళ్లుగా మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. పది రోజుల క్రితం అతని భార్య బసంతీదేవి, ముగ్గురు పిల్లలు రాజేష్‌బుయ్యాన్‌తో పాటు రాజుపాళెంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 25న దంపతుల మధ్య చిన్నపాటి వివాదం ఏర్పడటంతో బసంతీదేవి ఇంట్లో ఉన్న టాబ్లెట్‌లను మింగేసింది. గమనించిన రాజేష్ బుయ్యాన్ నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బసంతీదేవి(30) సోమవారం మృతి చెందింది. రాజేష్‌బుయ్యాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అధ్వానంగా తీర ప్రాంతాల రోడ్లు



కర్లపూడి, ఉచ్చూరువారిపాళెం రోడ్ల దుస్థితి

కోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రతీర ప్రాంతాల రోడ్లు అధ్వానం మారాయి. గూడలి నుంచి సముద్రతీరానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులుపడి చెరువును తలపిస్తోంది. కోట నుంచి కొక్కుపాడు, ఉచ్చూరువారిపాళెం, ఉత్తమనెల్లూరు, సిద్ధవరం వంతెన వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కోటపోలూరు రోడ్డులో కల్వర్టుకు గొయ్యి



సూళ్లూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కోటపోలూరు రోడ్డు బాగా దెబ్బతిని గోతులమంగా మారింది. సోమవారం కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న కల్వర్టుకు పెద్ద గొయ్యి ఏర్పడి వాహనాలకు ఇబ్బందిగా మారింది. వెంటనే ఎంపీడీవో మురళీకృష్ణ స్పందించి గొయ్యి పడిన చోట చెట్టు కొమ్మను పాతి ప్రమాదాలు జరగకుండా వాహనదారులను అప్రమత్తం చేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు నాయుడుపేట క్రీడాకారులు



జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన దీపిక, బెనేల్

నాయుడుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని కోరమంగల్ స్టేడియంలో ఈనెల 31 నుంచి నవంబరు 2వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు నాయుడుపేట క్రీడాకారులు బి.దీపిక, ఎస్.బెనేల్ ఎంపికైనట్లు తైక్వాండో అసోషియేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.అఖీల్, కోచ్ ఉయ్యాల పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో అండర్-68 కేజీల బాలికల విభాగంలో బి.దీపిక, అండర్-68 కేజీల బాలుర విభాగంలో ఎస్.బెనేల్ ప్రతిభ కనపరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని తైక్వాండో అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.మనీషా, కోచ్‌లు భగత్, చంద్రమోహన్, వినోద్‌కుమార్, అష్రఫ్, విజయ్, ఆంజనేయులు అభినందించారు.

బాలింతలకు పౌష్టికాహారం అందజేత

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో బాలింతలకు సోమవారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఆర్‌వీ రావు, సుధాకర్, గోపీనాథ్‌రెడ్డి, వెంకయ్య, గురునాథం, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుడికి చేయూత

నాయుడుపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట లోతువానిగుంటకు చెందిన రిక్షా కార్మికుడు షేక్ మస్తాన్‌కు సోమవారం మౌనిక మదర్ వెల్ఫేర్ సంస్థ అధ్యక్షురాలు రత్నశ్రీ బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఇటీవల ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పాటు వర్షాల వల్ల జీవనోపాధి లేకపోవడం మస్తాన్‌కు రత్నశ్రీ చేయూత అందించారు. కార్యక్రమంలో సుధాకర్ నాయుడు, సాయినాయుడు, రేష్మా, భావన, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తుఫానుతో నష్టం లేకుండా చూడండి

చిల్లకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఎటువంటి నష్టం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి అరుణ్‌బాబు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంను ఆయన పరిశీలించారు. తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎప్పటికప్పుడు తుఫాన్ గమనాన్ని తెలుసుకుంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్ఐ సురేష్‌బాబు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అరుణ్‌బాబు

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి



తడ మండలంలోని భీములవారిపాళెం పడవలరేవు వద్ద పరిస్థితి గురించి ఆర్డీవో కిరణ్మయితో మాట్లాడుతున్న స్పెషల్ కలెక్టర్ సందీప్ రఘువంశీ

తడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తుఫాన్ ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ శాఖ డీఈ కస్తూరి ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో శేఖర్ నాయక్, ఎస్ఐ కొండపనాయుడు, ఎంఈవో మల్లికార్జునరావు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్పెషల్ కలెక్టర్ సందీప్ రఘువంశీ సోమవారం సాయంత్రం తడ మండలం భీములవారిపాళెం పడవలరేవుకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులను ఆరా తీశారు. ఆయన వెంట సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, ఇతర అధికారులు ఉన్నారు.

సూళ్లూరుపేట: మొంథా తుఫాన్ ప్రభావంపై తహసీల్దార్ గోపీనాథ్ రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అధికారులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పులికాట్ తీరప్రాంత గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పునరాస కేంద్రాలు ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ, పోలీసులు ముంపు ప్రాంతాలను పరిశీలించి అక్కడ ప్రజలతో మాట్లాడి అప్రమత్తం చేశారు. కాళంగి నది, నెర్రి కాలువ, పాముల కాలువను పరిశీలించారు. కాళంగిలో చేపలు పట్టేవారిని పంపించేశారు. పులికాట్‌లో మరో మూడు రోజుల పాటు జాలర్ల వేటకు వెళ్లొద్దని సూచించారు. కాగా, సూళ్లూరుపేటలో సోమవారం ఉదయం నుంచి తేలికపాటి జల్లులతో కూడిన వర్షం కురిసింది.

కోట: మొంథా తుఫాన్ తీరం దాటే సమయంలో గాలులతో పాటు భారీ వర్షం పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం అన్నిశాఖల అధికారులతో మొంథా తుఫాన్‌పై సమీక్ష నిర్వహించారు. మండలంలో 7 తీరప్రాంత గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించామన్నారు. ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచామన్నారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి



దొరవారిసత్రం మండలంలోని పూలతోట సమీపంలో కన్నాకాలువ వంతెనను పరిశీలిస్తున్న అధికారుల బృందం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ప్రత్యేకాధికారి అరుణబాబు అన్నారు. సోమవారం నెల్లూరు నుంచి తిరుపతికి వెళ్తున్న ఆయన నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను పరిశీలించారు. అనంతరం సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లో తుఫాన్ ముందస్తు ఏర్పాట్ల గురించి ఆర్డీవో కిరణ్మయితో చర్చించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేస్తూ తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండలంలోని లోతట్టు ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. కాళంగి నదిపై తనియాలి వంతెనను, వెదురుపట్టు రోడ్డులోని పాలకాలువ వంతెన, పూలతోట వద్ద కన్నాకాలువపై ఉన్న వంతెనలను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువైతే వరదలు వచ్చి రహదాల్లో రాకపోకలు ఆగిపోయే అవకాశాలు ఉండటంతో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే సిబ్బందిని నియమించారు. అలాగే పులికాట్ తీరంలోని మీజూరు చెక్‌డ్యామ్ వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈ పర్యటనలో ఎంపీడీవో గోవర్ధన్, తహసీల్దారు శైలాకుమారి, ఎస్ఐ అజయ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని స్వర్ణముఖినది పరివాహక లోతట్టు ప్రాంతాలను అధికారులు, నాయకులు సోమవారం పరిశీలించారు. పాలచ్చూరు గ్రామంలో చెరువుకట్ట బలహీనంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి తహసీల్దార్ హరికృష్ణ, ఎస్ఐ నాగరాజుతో మాట్లాడి పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే ఎక్స్‌కవేటర్‌తో కలుజు, తూముల్లో పిచ్చి మొక్కలను తొలగించారు.

నాయుడుపేట: మండలంలోని స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద వరద నీటి ప్రవాహాన్ని తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు సోమవారం పరిశీలించారు. అలాగే పండ్లూరు వద్ద మామిడికాలువ ప్రవాహాన్ని, మాబాక కాజ్‌వే ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఓజిలి: మొంథా తుఫాన్ నేపథ్యంలో మండలంలోని సిబ్బందిని అప్రమత్తం చేశామని తహసీల్దారు పద్మావతి చెప్పారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వరద ముంపునకు గురయ్యే గ్రద్దగుంట ఎస్టీ కాలనీ, నెమళ్ళపూడి కరకట్ట ప్రాంతవాసులకు సమీపంలోని పాఠశాలలో వసతి ఏర్పాటు చేశామన్నారు. ఎంఈవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆయా గ్రామాల వీఆర్వోలు ఏర్పాట్లు చేశారని తెలిపారు. అదే విధంగా వరద ప్రవాహం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాలను గుర్తించి జాగ్రత్త చర్యలు తీసుకున్నామని చెప్పారు.

పార్టీలకు అతీతంగా సీఎం సహాయనిధి సాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పేదలందరికీ పార్టీలకు అతీతంగా సీఎం సహాయనిధి నుంచి సాయం అందజేస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 18 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.16.67 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు నియోజకవర్గంలో పలువురికి సీఎం సహాయనిధి నుంచి రూ.3 కోట్ల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ పరిధిలోని పేదలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే తన దృష్టికి తీసుకొస్తే సీఎం సహాయనిధి నుంచి సాయం అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లూరు జిల్లాలో గూడూరు గూడూరు నియోజకవర్గాన్ని కలిపేలా ప్రభుత్వానికి నివేదికను పంపాలని కలెక్టర్‌కు ఆదేశాలు అందాయన్నారు. త్వరలోనే ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, బిల్లు చెంచురామయ్య, రమణయ్య, పెంచలయ్య, వాటంబేడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో తీరప్రాంత గ్రామాలు



బాలిరెడ్డిపాళెం వద్ద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి, సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐలు నాగబాబు, పవన్

వాకాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో తూపిలిపాళెం సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. అలలు 5 మీటర్ల మేర ఎగిసిపడుతుండడంతో తీరప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మాధవాపురం, పున్నమామితిప్ప, తానాకట్ట, శ్రీనివాసపురం, పంబలి, పులింజరిపాళెం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చినతోట, వైట్‌కుప్పం, నవాబుపేట, పూడిరాయదొరువు, పూడికుప్పం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్ మాధవాపురానికి బోట్‌లో వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. తూపిలిపాళెం ఎస్టీకాలనీలో తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ గీతాకుమారి, సీఐ హుస్సేన్‌బాషా, వాకాడు, కోట ఎస్ఐలు నాగబాబు, పవన్ బాలిరెడ్డిపాళెం వద్ద ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. స్వర్ణముఖినది వంతెనపై రాకపోకలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూలిన పక్కా గృహం

చిట్టమూరు, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాకసిరి పాటిమిట్ట గిరిజన కాలనీకి చెందిన చెంబేటి సుధాకర్ ఇల్లు సోమవారం కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి బైట ఉండడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న సామగ్రి, నిత్యావసర సరుకులు పాడయ్యాయని బాధితుడు వాపోయాడు. వీఆర్వో సునైన, పంచాయతీ కార్యదర్శి రమేష్ కూలిన ఇంటిని పరిశీలించి తహసీల్దార్ నరేష్‌కు నివేదిక అందజేశారు.

పోలీస్ సిబ్బందికి రెయిన్ కోట్ల అందజేత

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ విధులు నిర్వహించనున్న పోలీస్ సిబ్బందికి డీఎస్పీ గీతాకుమారి రెయిన్ కోట్‌లను సోమవారం అందజేశారు.

యూరియా పంపిణీ

పెళ్లకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకూరు రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, వీఏఏ శ్రీనాథ్, టీడీపీ నాయకులు కలపాటి సురేష్, సుబ్బయ్య, వెంకటయ్య, ఉదయ్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలి

తడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలని ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖర్ ఆదేశించారు. తడ సబ్ స్టేషన్‌ను పరిశీలించిన ఆయన తుఫాన్ వల్ల ఏర్పడే అవరోధాలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనవెంట ఏడీఈ శేఖర్, ఏఈ మురళి ఉన్నారు.

తీరప్రాంత గ్రామాలకు రేషన్ బియ్యం తరలింపునకు చర్యలు



ఎంఎల్ఎస్ పాయింట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీనాథ్ రెడ్డి, ఆర్ఐ రాజగోపాల్

సూళ్లూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో తీరప్రాంత గ్రామాలు, ముంపు ప్రాంతాలకు రేషన్ బియ్యాన్ని తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి అధికారులతో కలిసి ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేశారు. వర్షాలు పడుతుండడంతో ముందుగానే రేషన్ బియ్యం తరలించాలని డీటీ తులసిని ఆదేశించారు.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పట్టణంలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం జల్లులు పడ్డాయి. తరువాత కొంతసేపు తెరపిచ్చినా మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా జల్లులు కురిశాయి.

జన సైనికుల్లో సయోధ్యకు శ్రీకారం

మంగళగిరిలో నేడు, రేపు ప్రత్యేక సమావేశాలు

విభేదాలకు కారణాలను తెలుసుకోనున్న శివశంకర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో ఉమ్మడి నెల్లూరు జిల్లా నాయకుల మధ్య సయోధ్య కుదిరించేందుకు ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్ శ్రీకారం చుట్టారు. జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు మంగళ, బుధవారాల్లో జిల్లా నాయకులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఇటీవల జనసేన నాయకుల మధ్య వర్గ విభేదాలు తారస్థాయికి చేరడంతో ఆగ్రహించిన పవన్ ఇరు వర్గాలను మంగళగిరి పార్టీ కార్యాలయానికి పిలిపించి క్లాస్ తీసుకున్నారు. ఈ క్రమంలో జిల్లాలో పార్టీని గాడిలో పెట్టేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌కు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని జనసేన పార్టీలో ఏం జరుగుతుంతో తెలుసుకొని విభేదాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లా నాయకులతో సమావేశాలు

పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు తమ్మిరెడ్డి శివశంకర్ మంగళగిరిలోని తన కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం కానున్నారు. మంగళవారం పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, రీజనల్ కోర్డినేటర్లు కోల విజయలక్ష్మి, నాగరత్నం, కావలి నియోజక వర్గానికి చెందిన అలహరి సుధాకర్, ఆత్మకూరుకు చెందిన నలిశెట్టి శ్రీధర్, గూడూరుకు చెందిన తీగల చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా కార్యదర్శి షేక్ ఆలియాతో సమావేశం అవుతారు. 29న సూళ్లూరుపేటకు చెందిన ఉయ్యాల ప్రవీణ్, సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన బొబ్బేపల్లి సురేష్, కోవూరుకు చెందిన చప్పిడి శ్రీనివాసులు, గూడూరుకు చెందిన పీవోసీ కే.మోహన్, వెంకటగిరికి చెందిన గూడూరు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మున్వర్‌బాషా, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు చెదలవాడ రాజేష్‌లతో సమావేశం అవుతారు. పార్టీలో ఏం జరుగుతోంది.. విభేదాలు ఎందుకు వస్తున్నాయి.. తదితర అంశాలపై శివశంకర్ జిల్లా నాయకులతో మాట్లాడనున్నారు. అనంతరం పవన్ కల్యాణ్‌కు నివేదించనున్నారు.

పోలీసు విధులు బాధ్యతాయుతమైనవి



విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన కల్పిస్తున్న సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే పోలీసుల విధులు బాధ్యతాయుతమైనవని పట్టణ సీఐ శేఖర్ బాబు అన్నారు. సోమవారం ఒకటో పట్టణ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బీసీ సంక్షేమ వసతి గృహంలో బాలికలకు పోలీస్‌శాఖ విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడేది పోలీస్ శాఖేనన్నారు. ప్రజల కోసం ప్రాణాలను సైతం అర్పించేందుకు పోలీసులు సిద్ధంగా ఉంటారన్నారు. అనంతరం విద్యార్థినులకు రిసెప్షన్ డెస్క్, వైర్లెస్ సెట్, డయిల్ 100 తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపునీరు నిలవకుండా పైపుల ఏర్పాటు



పైపులను ఏర్పాటు చేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలోని తహసీల్దారు కార్యాలయం పక్కన ఉన్న కాలనీలో వర్షపునీరు నిల్వ చేరకుండా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పైపులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిల్లకూరు పీఏసీఎస్ చైర్మన్ కొండా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కాలనీలో వర్షపునీరు నిల్వచేరి ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నేత తానంకి నానాజీ సహకారంలో పైపులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

వెంకటగిరి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని 8, 14, 24, 25 వార్డుల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, శాతరాసి బాలాయ్య, కల్యాణి రాజారెడ్డి, వెంకటరత్నం రాజు, ఆరి శంకరయ్య, కోడూరు కల్పలత, లక్ష్మి పాల్గొన్నారు.

పెళ్లకూరు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని చెంబేడు, అర్ధమాల, పునబాక గ్రామాల్లో వైసీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టింది. కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వెంకటరత్నం, గోపాల్, జితేంద్ర, బాలు, మోహన్, ఆనంద్, కృష్ణ, సురేష్, మునిరాజ, దయాకర్ పాల్గొన్నారు.